ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 35.0 కనిష్ఠం : 25.0

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

మంగళవారం 8 జూలై 2025



అగ్నిగుండ ప్రవేశం



కొలువుతీరిన పీర్లు



సెల్‌ఫోన్‌లో బంధిస్తున్న చిన్నారి



అలావ్ తొక్కుతూ..



ఊరేగింపుగా వస్తున్న పీర్లు



సన్నాయి మేళాలతో స్వాగతం



మొక్కు తీర్చుకుంటున్న భక్తులు

కుళ్లాయిస్వామీ.. గోవిందా..

- గూగూడులో మార్మోగిన స్వామినామం
- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- కిక్కిరిసిన వీధులు... జలధికి తరలిన పీర్లు

నార్పల, జూలై7(ఆంధ్రజ్యోతి): కుళ్లాయిస్వామి నామస్మరణతో మండలంలోని గూగూడు మార్మోగింది. ప్రసిద్ధి చెందిన గూగూడు కుళ్లాయిస్వామి మొహర్రం వేడుకల్లో భాగంగా స్వామివారు సోమవారం జలధికి వెళ్లారు. కుళ్లాయిస్వామి పీరు, వెండి గొడుగును తెల్లవారుజామున అగ్నిగుండ ప్రవేశం చేయించారు. సాయంత్రం తిరిగి అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమాన్ని భక్తులు చెట్లు, మిద్దెలపైకి ఎక్కి తిలకించారు. భారీగా జనం రావడంతో గూగూడు కిక్కిరిసిపోయింది. గ్రామ సమీపంలోని ఒక బావిలో కుళ్లాయిస్వామి జలధి కార్యక్రమం నిర్వహించారు. కుళ్లాయిస్వామి పీర్లను గ్రామ వీధుల్లో ఊరేగించారు. స్వామి జలధికి తరలడంతో భక్తులు కన్నీంటి పర్యంతమయ్యారు. కుటుంబీకులు, బంధువులతో కలిసి వచ్చిన భక్తులు ఊరి సమీపంలో షేమియానాలు వేసుకుని, విందు చేసుకున్నారు. గాజులు, స్వీట్ల దుకాణాల వద్ద కొనుగోలు చేస్తూ కనిపించారు. స్వామి జలధి కార్యక్రమం ముగిసిన వెంటనే భక్తులు ఒక్కసారిగా తిరుగు ప్రయాణం అవడంతో అక్కడక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బుధవారం కుళ్లాయిస్వామి చివరి దర్శనంతో ఉత్సవాలు ముగుస్తాయని ఈఓ శోభ తెలిపారు. అవంఛనీయ ఘటనలు తలెత్తకుండా సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

శ్మశానంలో అపమృత్యు హోమం

సమాధులను తొలగించినందుకు..



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

తాడిపత్రి, జూలై7(ఆంధ్రజ్యోతి): స్థానిక బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం సమీపంలోని శ్మశాన వాటికలో నారాయణ బలి, అపమృత్యు, నవగ్రహ తదితర హోమాలను సోమవారం నిర్వహించారు. ఆ శ్మశాన వాటిలో సమాధులను తొలగించిన సందర్భంగా భవిష్యత్తులో ఎలాంటి కీడు ఉండరాదని శాంతిహోమాలను మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పండితుడు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పాల్గొన్నారు.

10న రెండో విడత తల్లికి వందనం

రేపటిలోగా బ్యాంకు ఖాతా తప్పనిసరి

అనంతపురం విద్య, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్ మొదటి సంవత్సరం, ఒకటో తరగతిలో చేరిన అర్హత కలిగిన విద్యార్థులకు ఈ నెల 10వ తేదీన రెండో విడత తల్లికి వందనం సొమ్మును ప్రభుత్వం విడుదల చేస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామాంజనేయులు సోమవారం తెలిపారు. అర్హతగల విద్యార్థుల తల్లి పేరిట ఈ నెల 9వ తేదీలోగా తప్పనిసరిగా బ్యాంకు లేదా పోస్టాఫీసులో ఖాతా తెరవాలని సూచించారు. బ్యాంకు ఖాతాను ఎన్‌పీసీఐకి లింక్ చేయించుకోవాలని, అప్పుడే తల్లికి వందనం పథకం ప్రయోజనాలు అందుతాయని అన్నారు. కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలు బ్యాంకు ఖాతాలను ఓపెన్ చేయించాలని డీడీ సూచించారు.

వైసీపీ నేతలవి చౌకబారు వ్యాఖ్యలు: శ్రావణిశ్రీ

శింగనమల, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని వైసీపీ నేతలు చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నారని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నియోజకవర్గంలో ఎక్కడైనా ఇసుక అక్రమ రవాణా జరిగితే రాజకీయాలకు సంబంధం లేకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇది వైసీపీ నేతలకు కనబడటం లేదా అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి పాలకులు ఇసుకతో కోట్లు సంపాదించిన సంగతి ప్రజలకు తెలుసు అని అన్నారు. ప్రస్తుతం ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు సాక్ష్యాలుంటే నిరూపించాలని సవాల్ విసిరారు. రాజకీయ అస్తిత్వం కోసం చౌకబారు మాటలు మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఇసుక దోపిడీని చూసి దేశవ్యాప్తంగా ప్రజలు చూసి నివ్వెరపోయారని అన్నారు.

రిజిస్ట్రేషన్ వందశాతం జరగాలి

మెగా పీటీఎంపై కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం కలెక్టరేట్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్ 2.0లో సాక్షులుగా సచివాలయ సిబ్బంది రిజిస్ట్రేషన్, విద్యాసంస్థలకు కావాల్సిన మొక్కల రిజిస్ట్రేషన్ వందశాతం పూర్తి కావాలని కలెక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 10న నిర్వహించే మెగా పీటీఎంను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో జరిగే రిజిస్ట్రేషన్‌కు ఎంపీడీఓలు బాధ్యత వహించాలని, సాక్షులు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉండరాదని, థర్డ్‌పార్టీ ఉండాలని అన్నారు.

నేడు ప్లాంటేషన్

రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం చేపట్టే హార్టికల్చర్ ప్లాంటేషన్‌ను జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 2వేల ఎకరాల్లో హార్టికల్చర్ ప్లాంటేషన్ లక్ష్యం ఇచ్చామని, గుంతల తవ్వకం పూర్తి అయిందని తెలిపారు. హార్టికల్చర్ ప్లాంటేషన్‌కు ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. నెలాఖరుకు లక్ష్యం పూర్తి కావాలని అన్నారు. ఎంపీడీఓలు పాల్గొనాలని ఆదేశించారు. వీసీలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఎఫ్ఓ విగ్నేష్ అప్పావు, డీఈఓ ప్రసాద్‌బాబు, డీవీఈఓ వెంకటరమణ నాయక్, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, డీఎంహెచ్ఓ ఈబీ దేవి తదితరులు పాల్గొన్నారు.

అభిషేక్ డబుల్ సెంచరీ

- చిత్తూరు 455 పరుగుల భారీ స్కోరు
- దీటుగా జవాబిస్తున్న అనంత జట్టు



అభిషేక్ రెడ్డి



దత్తారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మూడోరౌండ్ మల్టీ డే క్రికెట్ పోటీల్లో చిత్తూరు బ్యాటర్ అభిషేక్ రెడ్డి డబుల్ సెంచరీ (291 బంతుల్లో 24 బౌండరీలు, రెండు సిక్సర్లతో 227)తో చెలరేగాడు. మూడో రౌండ్ పోటీలు సోమవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో రెండోరోజు కొనసాగాయి. అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో అనంతపురంతో మ్యాచ్‌లో ఓవర్‌నైట్ స్కోరు 316/3తో ఇన్నింగ్స్ కొనసాగించిన చిత్తూరు 115.2 ఓవర్లలో 455 పరుగులకు ఆలౌటైంది. అభిషేక్ రెడ్డికితోడు పృథ్వీ రాజ్ సెంచరీ (132)తో అలరించాడు. అనంత బౌలర్లు వినయ్‌కుమార్ 4, దీపక్, ప్రదీప్‌రెడ్డి, రాజుకుళ్లాయప్ప రెండు వికెట్లు చొప్పున పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 44 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 199 పరుగులు చేసింది. దత్తారెడ్డి మెరుపు సెంచరీ (100) సాధించాడు. రాయలసీమ్ క్రికెట్ గ్రౌండ్‌లో నెల్లూరు, కడప జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు 288 పరుగులకు ఆలౌటైంది. అనంతరం మొదటి ఇన్నింగ్ ప్రారంభించిన కడప ఓవర్‌నైట్ స్కోర్ 47/1తో రెండోరోజు ఇన్నింగ్స్ కొనసాగించింది. 69.1ఓవర్లలో 144పరుగులకు ఆలౌటైంది. అరీఫ్‌బాషా (62), వంశీకృష్ణ (54) పర్వాలేదనిపించారు. నెల్లూరు బౌలర్లు భరత్ 4, అఖిల్ 3, మాధవ్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు 40 ఓవర్లలో 179 పరుగులకు 6వికెట్లు కోల్పోయింది. రేవంత్‌రెడ్డి హాఫ్ సెంచరీ (76) సాధించాడు.

మేళా.. మేలా..?

- రూ.కోట్ల విలువైన ఫోన్‌ల రికవరీ
- నెలల తరబడి ఇవ్వకుండా డీపీఓలో నిల్వ
- వేలల్లో పోగయ్యాక.. డిస్ట్రిబ్యూషన్ మేళా..!
- ఇంతలోపే కొత్త ఫోన్‌లు కొంటున్న బాధితులు
- దొరికినవి ఇచ్చీ ప్రయోజనం లేదని ఆవేదన
- మూడేళ్లలో 12,594 ఫోన్‌లను రికవరీ చేసిన పోలీసులు



ఈ ఫొటో చూడండి..! ఉద్యోగుల బదిలీ కౌన్సెలింగ్ అయ్యుంటుంది అనుకుంటున్నారా..? కాదు, యువకులు కనిపిస్తున్నారు.. జాబ్ మేళా అయ్యుంటుంది అనుకుంటున్నారా..? అవేమీ కాదు..! ఉమ్మడి జిల్లాలో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్నవారు వీరంతా..! పోలీసులు వాటిని రికవరీ చేసి, జూన్ 27న అనంతపురం పోలీస్ పరేడ్ మైదానంలో బాధితులకు ఇచ్చేశారు. ఒకేసారి రూ.3.03 కోట్ల విలువైన 1,216 సెల్‌ఫోన్‌ల పంపిణీ చేశారు. చాలా గొప్ప విషయం కదా..? పోలీసుల చొరవను అభినందించాల్సిందే..! ఎందుకంటే.. ఒకప్పుడు బైక్‌పోతేనే కేసు కట్టేవారు కాదు. అలాంటిది సెల్‌ఫోన్ గురించి ఎవరు పట్టించుకుంటారు..? అందుకే.. ఫోన్ పోతే.. తమ ఖర్మ అనుకుని వదిలేసేవారు. ఇప్పుడు అలా కాదు..! పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. పోయిన ఫోన్ దొరుకుతుందనే భరోసా వచ్చింది. గడిచిన మూడేళ్లలో ఏకంగా 12,594 ఫోన్లను జిల్లా పోలీసులు రికవరీ చేసి ఇవ్వడం దీనికి నిదర్శనం. ఇది పైకి కనిపించే కోణం..! దీని వెనుక మరో కోణం ఉంది. పోయిన ఫోన్ దొరికినా.. బాధితుల కళ్లలో ఆనందం కనిపించడం లేదు.

ఏం ప్రయోజనం..?

అదేమిటీ..? పోయింది అనుకున్న ఫోన్ దొరికినా (మిగతా 6లో...)

యువతకు ఉద్యోగావకాశాలే సీఎం లక్ష్యం

- అందుకే రతన్ టాటా ఇన్నోవేషన్ స్పోక్
- జేఎన్‌టీయూ వీసీతో ఎమ్మెల్యే దగ్గుపాటి



వీసీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అనంతపురం క్రైం/రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): యువతకు నైపుణ్యాభివృద్ధితోపాటు, ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఆయన ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావుతో వర్సిటీలో ఏర్పాటుకాబోతున్న రతన్ టాటా ఇన్నోవేషన్ స్పోక్ సెంటర్‌పై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి ఇంట్లో ఒక ఎంటర్‌ప్రెన్యూర్ ఉండాలన్న ధ్యేయంతోనే సీఎం అడుగేస్తున్నారని తెలిపారు. విజన్-2047లో భాగంగా అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయబోతున్నారన్నారు. ఈ క్రమంలోనే అనంతపురం జేఎన్‌టీయూలో స్పోక్ సెంటర్‌ను ఏర్పాటు చేయబోతున్నారనీ, దీనికి రూ.30 కోట్లు విడుదల చేసిందన్నారు. ముఖ్యంగా యువతకు నైపుణ్యశిక్షణతోపాటు, స్టార్టప్‌ల ప్రోత్సాహానికి ఇది ఎంతగానో కృషి చేస్తుందన్నారు. ఈ ప్రాజెక్టులో గ్రీన్‌కో ఎనర్జీ, ఓఎన్‌జీసీ, గెయిల్, అవంతి గ్రూప్స్ వంటి ప్రముఖ సంస్థలు గవర్నింగ్ కమిటీలో భాగస్వాములుగా ఉంటాయన్నారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేయాలని ఆయన.. వీసీని కోరారు.

అరటి పరిశోధనా కేంద్రానికి స్థల పరిశీలన

7

మైలాపురంలో ఉద్రిక్తత

- దాడులు.. ప్రతిదాడులు



విజయ్ ఇంట్లో ధ్వంసమైన టీవీ, వస్తువులు

బొమ్మనహాళ్, జూలై 7(ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై దాడి .. బాధితుడి బంధువుల ఎదురుదాడితో మండలంలోని మైలాపురంలో సోమ వారం రాత్రి ఉద్రిక్తత నెలకొంది. కోళగానహళ్లి గ్రామానికి చెందిన అనంతరాజు మైలాపురానికి సోమవారం రాత్రి బైక్‌పై వెళ్లాడు. ఆ గ్రామానికి చెందిన విజయ్ అతనిపై దాడి చేసి.. బైక్‌ను ధ్వంసం చేశాడు. తీవ్రంగా గాయపడిన అనంతరాజును బళ్లారి విమ్స్‌కు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉంది. దీంతో ఆగ్రహించిన అనంతరాజు బంధువులు మైలాపురానికి వెళ్లి.. విజయ్‌కు చెందిన రెండు బైక్‌లు, ఒక కారును ధ్వంసం చేసి.. గడ్డివామికి నిప్పు పెట్టారు. ఇంటిలోని వస్తువులను ధ్వంసం చేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బొమ్మనహాళ్, కణేకల్, హీరేహాల్, రాయదుర్గం నుంచి పోలీసులు భారీగా మోహరించి.. బందోబస్తు నిర్వహిస్తున్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించండి

జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఉమామహేశ్వరమ్మ

7

వడ్డీ వ్యాపారుల దౌర్జన్యం

- డబ్బు కట్టలేదంటూ దాడి
- ఐదుగురిపై కేసు నమోదు

శభాష్.. రామాంజనేయులూ..!

బదిలీలు చాలా చక్కగా ఉన్నాయ్..!

- వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీలకు ఆమోదం
- ఉన్నతాధికారుల సంపూర్ణ మద్దతు



డీడీ రామాంజనేయులు

అనంతపురం విద్య, జూలై 7(ఆంధ్రజ్యోతి): బదిలీల్లో అక్రమాలు జరుగుతున్నాయని ఆందోళన చేసినా.. అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేసినా ఆయన ఏమాత్రం తగ్గలేదు. కౌన్సెలింగ్ ప్రక్రియలో గందరగోళం ఏర్పడి.. మరుసటి రోజుకు వాయిదా పడినా అదరలేదు.. బెదరలేదు. తెరవెనుక ఎవరైనా ఉన్నారో.. తెరముందు తానే ఉన్నారో తెలియదుగానీ.. అంతా ఆయన అనుకున్నట్లే నడిపించారు. ఆయనే.. సోషల్ వెల్ఫేర్ డీడీ రామాంజనేయులు. అనేక వివాదాల నడుమ ఆయన కౌన్సెలింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. బాధితులు కలెక్టర్ వినోద్ కుమార్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. డీడీ ఇచ్చిన జాబితాకు ఉన్నతాధికారులు ఆమోద ముద్ర వేశారు. ఆర్డర్ కాపీలు ఆదివారం ఉద్యోగుల వాట్సాప్ గ్రూపుల్లో పెట్టారు. దీంతో డీడీ రామాంజనేయులు పనితీరుపై 'ప్రశంసల వర్షం' కురుస్తోంది. ఆయన తన పవర్ ఏమిటో నిరూపించుకున్నారని పలువురు వ్యాఖ్యానించారు. ఉన్నతాధికారులు, పాలకపక్ష ప్రజా ప్రతినిధులు సైతం ఆయనను ఏమీ అనలేకపోయారని అంటున్నారు.

ఆక్రందనల నడుమ..

ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిసెంట్స్‌కు అనంతపురంలోని అంబేడ్కర్ భవన్‌లో డీడీ రామాంజనేయులు ఆధ్వర్యంలో ఇటీవల బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. తొలిరోజే ఖాళీలను చూపించకపోవడంతో వెల్ఫేర్ అసిస్టెంట్స్ పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఇదేమి అన్యాయమని నిలదీశారు. కొందరు కలెక్టర్‌ను కలిసి తమకు జరుగుతున్న అన్యాయం గురించి వివరించారు. ఆ రాత్రికే కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సచివాలయ ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. మరుసటి రోజు అదే అంబేడ్కర్ భవన్‌లోనే బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభమైంది. వేదికపై ఉన్న అధికారులు సచివాలయాల ఉద్యోగులను సీనియార్టీ జాబితా మేరకు పిలిచారు. ఆ వేదిక సాక్షిగా, వందలాది మంది ఉద్యోగుల ఎదుట డీడీ తన హవా ఏమిటో చూపించారు. ఒక్కో వెల్ఫేర్ అసిస్టెంట్ లోపలికి రాగానే.. 'ఏం పేరు...? చూడప్పా.. ఈయన పేరిట ఎమ్మెల్యే, నాయకులు సిఫార్సు లేఖ ఇచ్చారా..?' అని మైక్ పట్టుకుని మరీ ప్రశ్నించారు. సిఫార్సు లేఖ ఉంది అంటే చాలు.. 'నీకు ఏ ప్లేస్ కావాలో తీసుకో...' అని కోరిన చోటును కేటాయించారు. లేఖ లేదంటే మాత్రం 'ఫలానా ప్లేస్ ఉంది.. అక్కడికి పో' అని ఏకపక్షంగా ఆదేశిస్తూ.. రికార్డులలో రాయించారు. కోరుకున్న స్థానాలలో ఏ ఒక్కటీ రాకపోగా, జాబితాలో మొదటి వరుసలో ఉన్నా దూర ప్రాంతాలను కేటాయించారని బాధితులు లబోదిబోమన్నారు. కౌన్సెలింగ్‌లో మహిళా ఉద్యోగుల పట్ల దయ చూపలేదు. 'సార్.. అంత దూరం ఎలా వెళ్లగలం.. దగ్గరలో చూపించండి' అని కౌన్సెలింగ్ హాల్‌లోనే కన్నీరు

(మిగతా 6లో...)

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా మలేరియా అధికారి ఓబులు సూచన

అనంతపురం వైద్యం, జూలై7(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు సూచించారు. సోమవారం హెల్త్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓబులు మాట్లాడుతూ.. గ్రామాల్లో పర్యటించి వ్యాధుల తీవ్రతను గుర్తించాలన్నారు. సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ప్రజాపరిషత్ అధికారులు, సచివాలయాల సిబ్బందికి సమస్యలను వివరించాలన్నారు. ప్రతిగ్రామంలో పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓలు గిరిధర్‌రెడ్డి, మద్దయ్య, కోదండరామిరెడ్డి, రామకృష్ణ, నాగేంద్రప్రసాద్, మునాఫ్, తిరుపాలయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.



కష్టపడి చదువుకో.. బతుకు బాగుంటాది..



కట్టాలన్నీ తీరుతాయి పో తల్లీ..

చిలుక పలుకు..!

రాత బాగుంటే
రివ్వున ఎగిరేదాన్ని..
పచ్చని చెట్టుపై జంటగా వాలి
కోరిన పండ్లను కొరికి తినేదాన్ని..!

పంజరంలో చిక్కి..
పట్టుకున్నవాడు పలకమన్నట్లు పలికేదాన్నా..?
తలుపు తెరవగానే ఏదో ఓ పేక ముక్క తీసి..
పడేసి వెళుతున్నానేగానీ,
అందులో ఏముందో నాకు మాత్రం తెలుసునా..?

నా జాతకమే బాగుంటే..
రెక్కలుండీ ఎగరకపోదునా..?
ఏదో సరదాకి అయితే సరే..
నేనేదో తీశానని..
మీరేదో చెప్పారని..
నమ్మి మోసపోతే..
నాకు సంబంధం లేదు..!
(గూగూడులో సోమవారం)



- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి



ఇంకో యాభై ఈ బిడ్డా.. మంచి మొగుడొస్తాడు..



ఓ నల్లమూతులోడు.. నీకు సెడుపు సేత్తాండాడు..

17 నుంచి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఈనెల 17వ తేదీ నుంచి స్థానిక నాయక్‌నగర్‌లోని స్మాష్ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని అనంతపురం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు బుగ్గయ్యచౌదరి, జయకుమార్ తెలిపారు. బాలబాలికలు, వెటరన్ విభాగాల్లో సింగిల్స్, డబుల్స్ పోటీలు ఉంటాయన్నారు. అండర్-11కి 2015 జనవరి 1వ తేదీ తరువాత, అండర్-12కి 2013 జనవరి 1 తరువాత, అండర్-15కి 2011 జనవరి 1 తరువాత, అండర్-17కి 2009 జనవరి 1 తరువాత, అండర్-19కి 2007 జనవరి 1 తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల వారు ఈనెల 10వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడా కిట్లు తెచ్చుకోవాలన్నారు. వివరాలకు 9440605819 నంబరులో సంప్రదించాలని కోరారు.

అరణ్యంలో ఆకలి కేకలు..!

- మేత దొరక్క వన్యప్రాణులు విలవిల
- పంటలను మేస్తున్న వైనం
- నష్టపోతున్న అన్నదాతలు

అమడగూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): అడవుల్లో ఆకలిదప్పులతో వన్యప్రాణాలు విలవిల్లాడుతున్నాయి. మేత కరువవుతోంది, నీరు కూడా దొరకట్లేదు. దీంతో వన్యప్రాణాలు పొలాల వైపు వస్తున్నాయి. పంటలను మేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలవ్యాప్తంగా 1500 ఎకరాల్లో పంటలు సాగుచేశారు. వాటిని కాపాడుకోవడానికి రాత్రింబవళ్లు కాపలా కాయలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు.

నీరు, మేత కరువు

అడవుల్లో నీరు, మేత కరువవడంతో మైదాన ప్రాంతాల వైపు అడవి పందులు, జింకలు, నెమళ్లు వస్తున్నాయి. ఎలుగుబంట్లు, అడవి వంకలు, వాగులను ఆవాసాలుగా మార్చుకుంటున్నారు. సమీప పొలాల్లో మొలకెత్తుతున్న మొక్కలను నెమళ్లు తింటున్నాయి. వేరుశనగ, మొక్కజొన్న, సజ్జ, అలసంద, టమోటా మొక్కలు లేతగా ఉన్న సమయంలో జింకలు మేస్తున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. కోత దశలోని పంటలకు అడవి పందులు, ఎలుగుబంట్ల బెడద తప్పడం లేదంటున్నారు. మండలంలో కంచెనగారిపల్లి, చినగానపల్లి, చినపానిపల్లి, తిమిరికుంటపల్లి.. కొండలకు సమీపంలో ఉన్న గ్రామాల్లో వీటి బెడద ఎక్కువైందని రైతులు అంటున్నారు. గ్రామాల్లో జింకలు, నెమళ్లు మందలు మందలుగా చేరుతున్నాయి. అడవి పందుల సమస్య అధికంగా ఉంది. పంటలు సాగు చేయాలంటేనే భయపడాల్సి వస్తోందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖాధికారులు వన్యప్రాణుల బారి నుంచి పంటలను రక్షించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



తిమిరికుంటపల్లి వద్ద జింకలు మేసిన పంట

కొరవడిన చర్యలు

అడవిలో నిప్పు రాజుకోకుండా, వన్యప్రాణులకు తాగునీటి సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత అటవీ శాఖదే. ఆ దిశగా చర్యలు నామమాత్రంగానే కనిపిస్తున్నాయి. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు, అడవి జంతువులకు తాగునీటి తొట్టెలు ఏర్పాటు చేయట్లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అడవిజంతువుల కారణంగా వాటిల్లిన నష్టాన్ని జిల్లా అధికారులకు సమాచారం అందించి, పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

నెమళ్ల బెడద ఎక్కువ



నాలుగెకరాల్లో సజ్జ సాగుచేశా. మొలకెత్తిన పంటను నెమళ్లు తినేస్తున్నాయి. అప్పులు చేసి పంటలు సాగు చేస్తే నెమళ్లు మేసేస్తుండడంతో నష్టపోతున్నా. అధికారులు పరిహారం అందించేలా చూడాలి.

- లక్ష్మీనారాయణ, పత్రివాండ్లపల్లి

తగిన చర్యలు చేపడతాం

అడవుల్లో మేతలేక పచ్చని పొలాలను వన్యప్రాణులు తింటున్నది నిజమే. పొలాలను పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదికలు పంపి, పరిహారం అందేలా చూస్తాం. వన్య ప్రాణులకు అడవిలోనే నీరు తదితర సదుపాయాలు కల్పిస్తాం.

- గుర్రప్ప, రేంజ్ అధికారి, కదిరి

ఎకరాలో పంట తినేశాయి



జింకలు, ఎలుగుబంట్లు ఎకరాకుపైగా మొక్కలు మొదలు వరకు తినేశాయి. పంటను కాపాడుకోవడానికి రాత్రి సమయంలో పొలంలోనే పడుకుని కాపాలాకాయాల్సిన దుస్థితి ఏర్పడింది. వీటి బెడదతో పంటలు సాగుచేయాలంటే ఆలోచించాల్సి వస్తోంది.

- ఫక్కీరప్ప, తిమిరికుంటపల్లి

మేళా.. మేలా..?

(5వ పేజీ తరువాయి)

సంతోషంగా లేరా..? అంటే.. మెజార్టీ బాధితులు అవుననే అంటున్నారు. దీనికి కారణం.. రికవరీ చేసినా వెంటనే తిరిగి ఇవ్వకపోవడం. నెలల తరబడి నిల్వ చేసి, భారీ మొత్తంలో పోగయ్యాక అందరినీ పిలిచి ఇవ్వడం. ఫోన్ లేకుండా ఒక్క నిమిషం గడపలేరు. విద్యార్థి మొదలు వృద్ధుడి వరకూ స్మార్ట్ ఫోన్‌లను వినియోగిస్తున్నారు. కాలక్షేపం, సమాచారం, చదువు, శిక్షణ, ఉద్యోగం.. ఇలా అన్నీ అందులోనే ఇమిడి ఉన్నాయి. ఒకప్పుడు కంప్యూటర్‌లో నిక్షిప్తమైన సమాచారం ఇప్పుడు స్మార్ట్ ఫోన్‌లకు బదిలీ అయ్యింది. అన్ని సేవలూ అరచేతిలోకి వచ్చేశాయి. అలాంటి ఫోన్ పోతే.. వెంటనే దొరికితే పరవాలేదు. లేదంటే మరొకటి కొనాల్సిందే..! తప్పదు..! ఒకటి కొన్న తరువాత పోగొట్టుకున్న ఫోన్ దొరికినా, సమాచార పరంగా పెద్దగా ఒరిగేది ఉండదు.

ప్రపంచం పోయినట్లే..

రికవరీ చేసిన తరువాత నెలల తరబడి ఇవ్వకుండా నిల్వ చేస్తున్నారు. ఆ సమయంలో చార్జింగ్ లేక ఖరీదైన ఫోన్‌లు పాడైపోతున్నాయి. సిమ్ మార్చిన కారణంగా అందులో ఉన్న యాప్స్ పనిచేయవు. ఇది విద్యార్థులు, ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందికరం. స్మార్ట్ ఫోన్‌లలో చదువులకు సంబంధించిన సర్టిఫికెట్లు, రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు.. ఇలా అన్నీ నిల్వ చేసుకుంటారు. ఉద్యోగులు తమ కార్యాలయ ఫైల్స్, డేటాను నిక్షిప్తం చేసుకుంటారు. ఇంట్లో ఉన్నా, బయట ఉన్నా.. ఫోన్ ద్వారానే తమ సమస్యలను పరిష్కరించుకుంటారు, విధులు నిర్వర్తిస్తారు. ఇక సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల గురించి చెప్పాల్సిన పనేలేదు. వారి ప్రపంచమే అందులో ఉంటుంది. ఇలాంటివారు కనీసం రూ.50 వేలు.. ఆపై రూ.లక్షల విలువైన ఫోన్‌లను వాడుతుంటారు. ఫోన్ పోతే.. సమాచారం పోతుంది. కొత్త ఫోన్ కొనేందుకు భారీగా డబ్బు వెచ్చించాల్సి వస్తుంది. రికవరీ చేసి.. సకాలంలో బాధితులకు ఇవ్వకపోతే జరిగే నష్టం ఇది.

12, 594 ఫోన్లు రికవరీ

పోయిన ఫోన్‌ల రికవరీకి జిల్లా పోలీస్‌శాఖ మూడేళ్ల క్రితం ప్రత్యేక చర్యలు చేపట్టింది. 2022 జూన్ 26న చాట్‌బాట్ సేవలు ప్రారంభించారు. చోరీకి గురైన, పడేసుకున్న ఫోన్‌ల జాడ కనిపెట్టి, వాటిని రికవరీ చేసి బాధితులకు ఇవ్వడం ప్రారంభించారు. సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నవారు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్‌లో (సీఈఐఆర్) నమోదు చేసుకోవాలి. ఇందులో వేలాదిమంది బాధితులు రిజిస్టర్ చేసుకున్నారు. ఈ మూడేళ్ల కాలంలో జిల్లా పోలీసు శాఖ ఏకంగా 12,594 సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి, బాధితులకు ఇచ్చారు. ఇందులో 20 ఇతర రాష్ట్రాలకు చెందిన 1,179 ఫోన్లు ఉన్నాయి. అనంతపురం జిల్లాయేతరులవి 2,795 ఫోన్‌లు ఉన్నాయి. ఒక్కొక్క ఫోన్ విలువ సగటున రూ.10 వేలు అనుకున్నా.. రికవరీ చేసిన ఫోన్‌ల విలువ రూ.12 కోట్లకు పైగా ఉంటుంది. ఇది మామూలు విషయం కాదు. పోలీసు శాఖ పనితీరును అభినందించాల్సిందే. కానీ, ఈ కష్టానికి తగిన ఫలితం బాధితులకు చేరాలి కదా..?

మచ్చుకు కొన్ని..

- జిల్లాలోని ఓ పట్టణానికి చెందిన మహిళా ఉద్యోగి ఫోన్ చోరీకి గురైంది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. వెంటనే రికవరీ చేశారు. విషయం తెలుసుకుని, ఆ స్టేషన్ అధికారిని ఆమె కలిశారు. తన ఫోన్ ఇవ్వమని అడిగితే, జిల్లా కేంద్రంలో అప్పగించామని, రికవరీ మేళాలో ఇస్తారని చెప్పారు. అంతవరకూ ఫోన్ లేకపోతే తాను ఇబ్బంది పడతానని, విధి నిర్వహణకు సంబంధించిన ఫైల్స్, యాప్స్ అన్నీ అందులో ఉన్నాయని ఆమె వివరించారు. అయినా ఫలితం లేకపోయింది. దీంతో ఆ శాఖలో తెలిసినవారిని సంప్రదించి, అతి కష్టమ్మీద రికవీరి చేసిన ఫోన్‌ను తీసుకోగలిగారు.
- శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఓ రైతు సెల్‌ఫోన్ పోగొట్టుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. ఎనిమిది నెలల తరువాత రికవరీ చేసి ఇచ్చారు. 'ఇన్ని నెలల తర్వాత ఫోన్ ఇస్తే ఏం లాభం?' అని బాధిత రైతు నిట్టూర్చారు. పోలీసులు రికవరీ చేశారు కాబట్టి తీసుకుంటున్నాం. ఇది ఏమాత్రం పనిచేస్తుందో చూడాలి. దొరుకుతుందేమో అని కొన్నాళ్లు ఎదురుచూసి.. కొత్త ఫోన్ కొనుకున్నా..' అని ఆ రైతు అన్నారు.
- గుత్తి ప్రాంతానికి చెందిన ఓ యువకుడు ఇంజనీరింగ్ చదువుతున్నాడు. సుమారు 9 నెలల క్రితం అతని సెల్‌ఫోన్ చోరీ అయింది. పోలీసులకు ఫిర్యాదుచేశాడు. చాలా రోజులు రికవరీ చేయకపోవడంతో కొత్త ఫోన్ కొన్నాడు. ఇటీవల పోలీసులు అతన్ని పిలిచి, ఫోన్‌ను రికవరీ చేశామని ఇచ్చారు.
- అనంతపురం నగరానికి చెందిన ఓ పెయింటర్ నాలుగు నెలల క్రితం పాతూరులో ఫోన్ పోగొట్టుకున్నాడు. బైక్ డిక్కీలో ఉంచిన ఫోన్‌ను ఎవరో చోరీ చేశారు. ఆ తరువాత రెండు రోజుల్లోనే యూపీఐ యాప్స్ బాధితుడి బ్యాంకు ఖాతా నుంచి రూ.2 వేల వరకూ డబ్బులు లాగేశారు. పోయిన ఫోన్ సైబర్ నేరగాళ్ల చేతిలో పడితే బ్యాంకు ఖాతాలను లూటీ చేసేస్తారు.



సెల్‌ఫోన్లను అందజేస్తున్న ఎస్పీ జగదీష్ (ఫైల్)

వెంటనే ఇచ్చేయాలి..

ఒకప్పుడు టైం ఈజ్ మనీ..! ఇప్పుడు ఇన్ఫర్మేషన్ ఈజ్ వెల్త్..! అలాంటి సంపద నిక్షిప్తమైన సెల్‌ఫోన్‌లను తిరిగి ఇవ్వడమంటే కొందరికి జీవితాన్ని తిరిగి ఇవ్వడమే. అందులో విలువైన వ్యక్తిగత సమాచారం ఉంటుంది. మరీ ముఖ్యంగా విద్యార్థినులు, యువతులు, మహిళల స్మార్ట్ ఫోన్‌లు ఇతరుల చేతుల్లో పడితే జరిగే నష్టాన్ని అంచనా వేయలేం. అందుకే, ఫోన్‌ల రికవరీ అన్నది చాలా గొప్ప కార్యక్రమం. కానీ, ఆ ఫలాలు బాధితులకు దక్కినప్పుడే లక్ష్యం నెరవేరినట్లు. దొరికిన ఫోన్‌లు దొరికినట్లే.. స్థానిక పోలీస్ స్టేషన్‌లలో ఇవ్వడం ప్రయోజనకరం. కనీసం వారంలో ఒక రోజో, నెలకు రెండు రోజులో ఈ కార్యక్రమాన్ని ఎక్కడికక్కడ ఏర్పాటు చేయాలి. ఆరు నెలలకు, ఏడాది ఒకసారి జిల్లా కేంద్రంలో రికవరీ ప్రగతి గురించి మీడియాకు వివరాలు ఇవ్వొచ్చు..! ఆ దిశగా పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఆలోచించాలి.

- అనంతపురం క్రైం, ఆంధ్రజ్యోతి

కరివేపాకు రైతు కుదేలు

- కిలో రూ.4కి పడిపోయిన ధర
- మూడునెలల క్రితం కిలో రూ.45..
- పంటను రక్షించుకునేందుకు లక్షల ఖర్చు

తాడిపత్రి, జూలై 7(ఆంధ్రజ్యోతి): కరివేపాకు రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. మూడునెలల వ్యవధిలోనే ధర గణనీయంగా పడిపోయింది. ఏప్రిల్ నెలలో కిలో రూ.45 ఉన్న కరివేపాకు ధర అధఃపాతాళానికి పడిపోయింది. నేడు కిలో నాలుగు రూపాయలకు చేరిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. రైతులకు పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. పంటను కోసి ఇతర ప్రాంతాలకు సరఫరా చేయడం వల్ల లాభం రాకపోగా నష్టాలు భరించాల్సి వస్తోంది. కూలి, రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతుండడంతో కరివేపాకు పంటపై రైతులు ఆశలు వదులుకున్నారు. తాడిపత్రి మండలంలో 500 ఎకరాలు, పెద్దపప్పూరులో 800, యాడికిలో 100, యల్లనూరులో 50 ఎకరాలు, పుట్లూరు మండలంలో 100 ఎకరాల్లో కరివేపాకు సాగుచేస్తున్నారు. ఒకప్పుడు ఒడిశా నుంచి కరివేపాకు విత్తనాలు వడ్లపూడి, మంగళగిరి, గుంటూరు ప్రాంతాలకు సరఫరా అయ్యేవి. అక్కడి నుంచి రైతులు తాడిపత్రికి తీసుకొచ్చి విక్రయించేవారు. ప్రస్తుతం ఆ ప్రాంతాల్లో కూడా కరివేపాకు అధిక విస్తీర్ణంలో సాగవుతోంది. దీంతో తాడిపత్రి కరివేపాకుకు డిమాండ్ పడిపోయింది. తాడిపత్రి మండల రైతులు ఇతర ప్రాంతాలకు చెందిన వారి పొలాలను గుత్తకు తీసుకొని కరివేపాకును సాగుచేయడమే కాకుండా అక్కడివారికి ఈ పంటను పరిచయం చేశారు. తాడిపత్రి ప్రాంత కరివేపాకు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ముంబై, చెన్నై, బెంగళూరు తదితర నగరాలకు రవాణా అవుతోంది.



కరివేపాకు పంట

పెద్దఎత్తున కొత్త బోర్లు

వర్షాభావ పరిస్థితులతో పాటు అడుగంటిన భూగర్భజలాల కారణంగా కరివేపాకు పంటను రక్షించుకునేందుకు తాడిపత్రి, పెద్దపప్పూరు మండలాల్లో పెద్దఎత్తున కొత్త బోర్లు వేస్తున్నారు. వర్షాలు సరిగా రాకపోవడంతో బోర్లు అడుగంటిపోయాయి. వందల ఎకరాల్లో సాగులో ఉన్న కరివేపాకును రక్షించుకునేందుకు రైతులు అధిక సంఖ్యలో బోర్లు వేస్తున్నారు. ఇందుకోసం లక్షలాది రూపాయలు ఖర్చుచేస్తున్నారు. 900 నుంచి 1000 అడుగుల వరకు బోర్లు వేస్తున్నా ఆశించిన స్థాయిలో నీరు పడడం లేదు. బోరు వేసేందుకు అడుగుకు రూ.120 నుంచి రూ.150 వరకు ఖర్చుచేస్తున్నారు. దీంతో ఒక్కో బోరుకు రూ.1.50 లక్షల వరకు ఖర్చుచేసే పరిస్థితి ఏర్పడుతోంది. చాలా వరకు బోర్లలో నీళ్లు పడలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి బోర్లు వేస్తున్నా తమకు అదృష్టం వరించడంలేదని పలువురు రైతులు వాపోతున్నారు. చెన్నైలో రెండు నుంచి మూడు రూపాయలే ధర పలుకుతోందని రైతులు చెబుతున్నారు.

దిక్కుతోచడం లేదు



ఆరు ఎకరాల్లో కరివేపాకు పంట సాగుచేశాను. గతంలో ధర బాగున్నా ప్రస్తుతం గణనీయంగా పడిపోయింది. మూడు నెలల క్రితం కిలో రూ.40 నుంచి 45 ఉన్న కరివేపాకు నేడు నాలుగు రూపాయలకు చేరుకోవడంతో దిక్కు తోచడం లేదు. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి ఉంటే అప్పులపాలు కాక తప్పదు.

-సూర్యనారాయణ, కరివేపాకు రైతు, యర్రగుంటపల్లి

పెట్టుబడులు కూడా రాలేదు



అన్ని ప్రాంతాల్లో కరివేపాకు సాగు ఎక్కువగా చేస్తుండడంతో దిగుబడి కూడా ఎక్కువగా ఉంది. దీంతో ధరలు పడిపోయాయి. పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితులు ఉన్నాయి. ఆరు ఎకరాల్లో పంట సాగుచేశాను. దిగుబడి వచ్చింది కానీ రేటు లేదు. కొత్తగా బోర్ల కోసం దాదాపు రూ.4లక్షల మేర ఖర్చుచేశా.

-యుగంధర్, రైతు, యర్రగుంటపల్లి

మీ ఓనర్‌ని కలవమను..!

కియ వద్ద వాహన డ్రైవర్లకు బెదిరింపులు

రెండు ప్రాంతాల్లో ఐచర్ వాహనాల ధ్వంసం



కియ వద్ద ధ్వంసమైన ఐచర్

పెనుకొండ రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): 'మీ ఓనర్‌కి ఎన్నిసార్లు చెప్పాలి..? మమ్మల్ని కలవమంటే కలవరు. ఫోన్ చేస్తే ఎత్తరు. మీ ట్రాన్స్‌పోర్ట్ ఎలా జరుగుతుందో చూస్తాం..' అని కియ వద్ద దుండగులు రెచ్చిపోయారు. కార్ల తయారీ పరిశ్రమకు విడి భాగాలు తరలించే ఐచర్ వాహన డ్రైవర్లను బెదిరించారు. వాహనాల అద్దాలను ధ్వంసం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం దుద్దేబండ సమీపంలోని కియ అనుబంధ పరిశ్రమ ఎస్వీహెచ్ కంపెనీ వద్ద సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్వీహెచ్ కంపెనీ నుంచి కార్ల పరిశ్రమకు విడి భాగాలను పీఎంకే ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ తన వాహనాల్లో తరలిస్తుంటుంది. ఈ కంపెనీ నుంచి కమీషన్‌లు రాబట్టుకునేందుకు దుండగులు బెదిరింపులకు దిగారు. దుద్దేబండ క్రాస్ వద్దకు పీఎంకే వాహనం రాగానే బైకుల్లో సుమారు పదిమంది దుండగులు వచ్చి అడ్డగించారు. డ్రైవర్ ఆనంద్ జేబులో ఉన్న మొబైల్ ఫోన్ లాక్కున్నారు. 'మమ్మల్ని కలవమని మీ ఓనర్‌కు ఎన్నిసార్లు చెప్పినా కలవరా..?' అని డ్రైవర్‌ను బెదిరించారు. వాహనం అద్దాలను ధ్వంసం చేశారని డ్రైవర్ వాపోయాడు. ఈ సంఘటన జరిగిన అరగంట వ్యవధిలోనే పాలసముద్రంలోని మరో ఐచర్ వాహనాన్ని ధ్వంసం చేశారు. డ్రైవర్ రఫీక్‌ను బెదిరించారు. ఈ దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని డ్రైవర్లు ఆనంద్, రఫీక్ తెలిపారు. తమకు ఫిర్యాదు అందలేదని కియ ఎస్ఐ రాజేష్ అన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడి దుర్మరణం

రామగిరి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు గ్రామ సమీపాన సోమవారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తా పడి సాయికుమార్(23) దుర్మరణం చెందాడు. పేరూరుకు చెందిన వెల్డింగ్ మల్లేశ్ కుమారుడు సాయికుమార్ ట్రాక్టర్ తోలుకుంటూ ఇంటికి వస్తుండగా అదుపు తప్పి, పక్కనే ఉన్న కాలువలోకి బోల్తాపడింది. సాయికుమార్ మీద పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సాయికుమార్‌కు భార్య అంజలి, నాలుగునెలల చిన్నారి ఉన్నారు. ఎస్ఐ సుధాకర్ యాదవ్ ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని ధర్మవరం ఆస్పత్రికి తరలించారు.

శభాష్.. రామాంజనేయులూ..!

(5వ పేజీ తరువాయి)

పెట్టుకున్నారు. వారి గోడు వినిపించుకోలేదు.

చక్రం తిప్పింది అతనేనా..?

బదిలీల ప్రక్రియలో ఓ వెల్ఫేర్ అసిస్టెంట్ చక్రం తిప్పాడని అంటున్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియ కోసం అతన్ని కార్యాలయానికి ప్రత్యేకంగా పిలిపించుకున్నారని సమాచారం. అతని మధ్యవర్తిత్వంతోనే భారీగా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో ఎమ్మెల్యే సుమారు పది మందికి సిఫార్సు చేశారని, వాటిని సాకుగా చూపించి, చాలామందికి కోరుకున్న స్థానాలు ఇచ్చారని అంటున్నారు. ఆ వెల్ఫేర్ అసిస్టెంట్ ద్వారా ఒప్పందం కుదుర్చుకున్న వారికి అడిగిన స్థానాలను కేటాయించారని సమాచారం. ఇంత బహిరంగంగా కౌన్సెలింగ్‌లో అక్రమాలు జరిగినా ఉన్నతాధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో జరుగుతున్న అక్రమాలపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలను ప్రచురించింది. కలెక్టర్ స్పందించి, అప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించారు. పారదర్శకంగా బదిలీలు చేయాలని ఆదేశించారు. అయినా డీడీ రామాంజనేయులు వంటి అధికారుల తీరులో మార్పు రాలేదు. బాధితులు కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులను కలిసి గోడు వెళ్లబోసుకున్నా ఫలితం లేకపోయింది. బదిలీ ఉత్తర్వుల జాబితాలో ఏ మార్పూ లేకపోవడంతో బాధితులు పలువురు కంటతడి పెట్టుకుంటున్నారు. ఈ స్థాయి హవా నడిపిన అధికారులకు ఆగస్టు 15న 'ఉత్తమ అధికారులు'గా పురస్కారాలు అందజేసి సత్కరిస్తే.. స్ఫూర్తిదాయకంగా ఉంటుంది.

భక్తిపారవశ్యం



నరసింహస్వామికి అలంకరణ

మడకశిర రూరల్, జూలై7(ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశిని పురస్కరించుకుని భక్తరహళ్ళి నరసింహస్వామి ఆలయం వద్ద సోమవారం మినీ భూతప్పల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నరసింహస్వామితోపాటు జిల్లేడగుంట ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మినీ భూతప్పల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, సంతానంలేని వారు స్నానం చేసి తడి గుడ్డలతో ఆలయం వద్ద భూతప్పలు వచ్చే దారిలో బోర్లా పడుకున్నారు. నరసింహస్వామి, ఆంజనేస్వామి ఉత్సవమూర్తులను జిల్లేడగుంట ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చారు. నరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం భూతప్పల ఉత్సవాలు మొదలయ్యాయి. స్వామివారి ఉత్సవమూర్తులను తీసుకొస్తూ దారిలో పడుకున్న భక్తులపై కాలుమోపుతూ భూతప్పలు దేవాలయానికి చేరుకున్నారు. ఇలా భూతప్పలు కాలుమోపితే రోగాలు నయమవుతాయనీ, సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. అనంతరం భక్తులు నరసింహస్వామి ఆలయ ప్రదక్షిణ చేసి, మొక్కులు తీర్చుకున్నారు. భూతప్ప స్పర్శ కోసం ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.



భక్తులపై కాలు మోపుతూ వెళ్తున్న భూతప్ప



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న వేదపండితులు

క్రైం కార్నర్

గంజాయి స్వాధీనం..10 మంది అరెస్ట్


పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు

రాయదుర్గం, జూలై 7(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి రాయదుర్గం ప్రాంతానికి అక్రమంగా గంజాయిని తరలించి విక్రయిస్తున్న పది మందిని అరెస్ట్ చేసి 1.709 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ జయనాయక్ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పది మంది సులువుగా డబ్బులు సంపాదించాలన్న దురాశతో గంజాయి విక్రయానికి అలవాటు పడ్డారు. కర్ణాటకలోని బళ్లారి నుంచి తీసుకొచ్చి రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాలలో విక్రయించేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. బళ్లారిలోని రైల్వేస్టేషన్, బస్టాండ్ ప్రాంతాలలో ఉన్న సాధువుల దగ్గర కిలో రూ. 25 వేలు ప్రకారం కొనుగోలు చేసి రైలు మార్గం ద్వారా జిల్లాలోకి ప్రవేశించారు. ఇక్కడికి వచ్చిన తర్వాత చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చుకుని విక్రయించేందుకు సిద్ధంగా పెట్టుకున్న కంబదూరు మండలంలోని కర్తనపర్తి గ్రామానికి చెందిన బోయ నరేష్, కొత్తూరు గ్రామానికి చెందిన కోడిపల్లి రామాంజనేయులు, చెన్నంపల్లికి చెందిన మారన్న, ఆత్మకూరు మండలం తోపుదుర్తికి చెందిన చిట్టి మారప్ప, అనంతపురం మండలం పులకుంట గ్రామానికి చెందిన వెంకటరాముడు, నగరానికి దంపట్ల జీవన్‌కుమార్, బండి ఉదయ్ కిరణ్, ఇమామ్‌సాబ్, షేక్ అన్వర్‌బాష, గార్లదిన్నె మండలంలోని పాతకల్లుకు చెందిన అంచెల రసూల్‌ఖాన్‌లు సమూహంగా ఏర్పడ్డారు. రాయదుర్గం పట్టణంలోని కణేకల్లు రోడ్డులో ఉన్న రైల్వే బ్రిడ్జి వద్ద వీరిని అదుపులో తీసుకున్నామని అన్నారు. వీరి వద్ద నుంచి 1.709 కిలోల గంజాయితో పాటు ఏడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని వీరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య


విష్ణువర్దన్ (ఫైల్)

చిలమత్తూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపురం గ్రామానికి చెందిన విష్ణువర్దన్ (30) ప్రేమ విఫలమై సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదినారాయణప్ప కుమారుడు విష్ణువర్దన్ ఒక అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయి దూరమవడంతో తీవ్ర మానసిక వేదనకు లోనయ్యాడు. దాంతో కొన్నాళ్లుగా మానసికంగా ఇబ్బంది పడుతుండేవాడు. ఈ నేపథ్యంలోనే ఇంట్లో ఎవరూలేని సమయంలో పైకప్పునకు ఉరేసుకున్నాడు. కుటుంబీకులు గుర్తించేసరికి మరణించాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. యువకుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వాకింగ్ చేస్తుండగా.. గొలుసు అపహరణ


పుష్పవతి మెడకు గాయం

నార్పల, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీ పప్పూరు గ్రామం వద్ద సోమవారంతెల్లవారుజామున నెట్టెం పుష్పవతి మెడలోని మూడు తులాల బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగుడు ఎత్తుకెళ్లాడు. బీ పప్పూరు గ్రామానికి చెందిన నెట్టెం కృష్ణయ్య భార్య పుష్పవతి రోజులాగానే రోడ్డు వైపు వాకింగ్‌కు వెళ్లింది. ఒంటరిగా వాకింగ్ చేస్తుండగా ద్విచక్రవాహనంలో వచ్చిన దుండగుడు.. ఆమె మెడలోని మూడు తులాల బంగారు చైన్‌ను లాక్కెళ్లాడు. దీంతో పుష్పవతి మెడ, మోకాళ్లకు గాయాలయ్యాయి. పుష్పవతి.. గ్రామస్తులను తీసుకొచ్చేలోగా దుండగుడు పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో బాలుడికి తీవ్రగాయాలు

గాండ్లపెంట, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గగన్ అనే బాలుడు సోమవారం విద్యుత్ షాక్‌తో తీవ్రగాయాలైన సంఘటన చోటు చేసుకుంది. బాలుడి తల్లిదండ్రులు సంతోష్‌కుమార్, పవిత్ర తెలిపిన వివరాల మేరకు.. ఆరేళ్ల వయస్సున్న గగన్ పశువుల ఆసుపత్రి వద్ద ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు కట్టి వెళ్లి విద్యుత్ వైర్లకు తగినట్లు చెప్పారు. విద్యుత్ షాక్ తగలడంతో స్పృహతప్పి పోయాడని, ఎడవచేయి భాగంతో పాటు మెడపూర్తిగా కాలిపోయిందన్నారు. చికిత్స కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రి తరలించామని అన్నారు.

మహిళ అదృశ్యం

కదిరిఅర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు అప్‌గ్రేడ్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కౌలేపల్లికి చెందిన వివాహిత సాయిలీలా ఈనెల 1న ఇంటిలో నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదన్నారు. భర్త, కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా ఆచూకీ లేకపోవడంతో సోమవారం భర్త శీను ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకున్నట్లు చెప్పారు.

ఎవరిదో..?

● వారం రోజులుగా రోడ్డుపైనే కారు



రోడ్డుపై వదిలేసిన కారు

నార్పల, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాంపల్లికి వెళ్లే రోడ్డు పక్కన కారు వారం రోజులుగా ఉంది. ఎవరిదో తెలీదు. ఎవరూ తీసుకెళ్లట్లేదు. రోడ్డుపై వెళ్లేవారు కారుపై చర్చించుకుంటున్నారు. పోలీసులకు సమాచారం అందించినా పట్టించుకోవడంలేదని తెలిసింది. కారు రెండు చక్రాలు పంచర్ అయినట్లు తెలిసింది. దొంగలు వదిలేసి వెళ్లారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఎస్ఐ సాగర్‌ను అడగ్గా.. విచారణ చేస్తున్నామనీ, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

వడ్డీ వ్యాపారుల దౌర్జన్యం

● డబ్బు కట్టలేదంటూ దాడి
● వన్‌టౌన్ వద్ద బంగారు వ్యాపారుల ఆందోళన
● ఐదుగురిపై కేసు నమోదు
● అధిక వడ్డీ వసూలు చేస్తే తాట తీస్తాం: సీఐ


ఆందోళనకారులతో మాట్లాడుతున్న సీఐ శ్రీకాంత్ యాదవ్

అనంతపురం క్రైం, జూలై 7(ఆంధ్రజ్యోతి): వడ్డీకి తీసుకున్న డబ్బు కట్టలేదంటూ... కొందరు వడ్డీ వ్యాపారులు.. దాడి చేయడం పాతూరులో పెద్దదుమారం రేపింది. బాధితులకు అండగా కొందరు బంగారు వ్యాపారులు.. వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వద్ద సోమవారం ఆందోళనకు దిగారు. దాడి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అధిక వడ్డీలు వసూలు చేస్తే... తాట తీస్తామని, నడిరోడ్డుపైనే థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తామంటూ సీఐ శ్రీకాంత్ యాదవ్ తీవ్రంగా హెచ్చరించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బంగారు వ్యాపారి బాబ్‌జాన్.. భవానీనగర్‌కు చెందిన వడ్డీ వ్యాపారి తిరుపాల్ వద్ద రూ.2 లక్షలు వడ్డీకి తీసుకున్నాడు. ఐదేళ్ల క్రితం తీసుకున్న డబ్బుకు నెలనెలా రూ.40వేల వరకూ చెల్లించాడు. ఇక వడ్డీ కట్టలేననీ, రూ.2 లక్షల మొత్తాన్ని రూ.50వేల చొప్పున నాలుగు విడతల్లో చెల్లిస్తానని వ్యాపారి చెప్పుకున్నాడు. ఉదయం ఇస్తానని చెప్పి ఇవ్వకపోవడంతో...తిరుపాల్, అతడి కుమారుడు సూరి, మరో ముగ్గురు అనుచరులతో కలిసి పాతూరులోని బాబ్‌జాన్ షాపు వద్దకు వచ్చి నిలదీశారు. డబ్బు ఎందుకు ఇవ్వలేదంటూ బాబ్‌జాన్‌పై దాడి చేశారు. అక్కడే ఉన్న బంగారు షాపుల యజమానులు సర్దిచెప్పేందుకు ప్రయత్నించిన వారు వినలేదు. బాధితుడితో కలిసి బంగారు వ్యాపారులు వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వద్దకెళ్లి ఆందోళన చేశారు. కొంతసేపు వన్‌టౌన్ పరిసరాల్లో ట్రాఫిక్ జామ్ అయ్యింది. బాధితుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్, ఎస్ఐ శ్రీనివాస్.. నిందితులు తిరుపాల్, సూరి, సోము, అంజి, అసంఅలీని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఐదుగురిపై కేసు నమోదు చేశారు. బాధితులకు సీఐ హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు.

అధిక వడ్డీల కోసం పీడిస్తే... తాట తీస్తాం : సీఐ శ్రీకాంత్ యాదవ్

అధిక వడ్డీల కోసం జనాలను పీడిస్తే తాట తీస్తాం. అలా వేధిస్తుంటే... బాధితులు పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చు. కఠిన చర్యలు తీసుకుంటాం. వడ్డీ వ్యాపారులు ప్రాంసరీ నోట్ ఉంటే.. కోర్టుకు వెళ్లి తెచ్చుకోవాలే తప్ప.. ఇలా ఇళ్ల వద్దకు వెళ్లి దౌర్జన్యాలు చేయడం సరికాదు. నడిరోడ్డులోనే పనిష్మెంట్ ఇస్తాం. థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తాం.

మెగా పీటీఎంపై కసరత్తు

విద్యాశాఖ, డ్వామా, డీఆర్‌డీఏ శాఖలతో కమిటీలు
కమాండ్ కంట్రోల్ నుంచే ఎంఈఓలు, హెచ్‌ఎంలకు ఆదేశాలు

అనంతపురం విద్య, జూలై7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 10వ తేదీన పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించ తలపెట్టిన మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం)పై జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. పీటీఎం నిర్వహణపై కలెక్టర్ వినోద్ కుమార్ ప్రత్యేక దృష్టిపెట్టారు. పీటీఎం నిర్వహణలో ఇతర శాఖలు భాగస్వాములు కావాలని ఆదేశించారు. తల్లి పేరున పిల్లలతో తప్పనిసరిగా మొక్కలు నాటించాలని, ఆ మొక్కకు విద్యార్థి పేరుతో జీపీఎస్ ట్యాగ్‌చేసి పెంచే బాధ్యతలను అప్పగించాలని ఆదేశాలిచ్చారు. ఇందుకు విద్యార్థికిగ్రీన్ పాస్‌పోర్టు జారీ చేయనున్నారు. దీంతోవిద్యాశాఖ, డ్వామా, డీఆర్‌డీఏ, అటవీ శాఖాధికారులు, సిబ్బందితో సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఐసీ సెంటర్‌లో డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్రశిక్ష ఏపీసీ శైలజ ప్రత్యేకంగా సమీక్షలు నిర్వహిస్తూ, నిర్వహణకు కమిటీలు ఏర్పాటు చేస్తూ బాధ్యతలు అప్పగించారు. అక్కడ కమాండ్ కంట్రోల్ నుంచే ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో కాన్ఫరెన్స్‌లలో మాట్లాడుతున్నారు. పీటీఎం నిర్వహణపై మార్గదర్శకాలు ఇస్తున్నారు.

1,747 స్కూళ్లకు రూ. 2.75 కోట్లు జమ

పీటీఎం నిర్వహణ తేదీ దగ్గర పడుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు మెయింటెనెన్స్ గ్రాంట్ మంజూరు చేసింది. తొలివిడతలో 50శాతం గ్రాంట్ విడుదల చేసింది. జిల్లాలోని 1,747 స్కూళ్లకు రూ.2.75 కోట్లు విడుదలకాగా.. ఆ సొమ్మును ఏపీసీ శైలజ.. ఆయా పాఠశాలలకు పిల్లల సంఖ్యను బట్టి జమ చేశారు. ఈ నిధుల్లో 20 శాతం పీటీఎం నిర్వహణకు వినియోగించుకోవచ్చని ఏపీసీ తెలిపారు. మొత్తంమీద విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు, సిబ్బంది పీటీఎం నిర్వహణ ఏర్పాట్లపై తలమునకలవుతున్నారు.

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గుంతకల్లు రైల్వే డివిజన్ మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. సికింద్రాబాద్-అరిసికెర (వయా గుంతకల్లు) ప్రత్యేక వీక్లీ రైలు (నం 07079) ఈ నెల 17వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకూ ప్రతి ఆదివారం సాయంత్రం సికింద్రాబాదులో బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 12-45 గంటలకు అరిసికెరెకు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07080) ఈ నెల 14వ తేదీ నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకూ ప్రతి సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు అరిసికెరెలో బయలుదేరి మంగళవారం ఉదయం 7-45 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు బేగంపేట, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, యాద్గిర్, క్రిష్ణా, రాయచూర్, మంత్రాలయం రోడ్డు, గుంతకల్లు, గుత్తి, అనంతపురం, ధర్మవరం, హిందూపురం, యల్హంక, టుముకూరు స్టేషన్ల మీదుగా వెళ్తుందని తెలియజేశారు. హైదరాబాద్-అరిసికెరె (వయా డోన్-అనంతపురం) ప్రత్యేక వీక్లీ రైలు (నం. 07069) ఈ నెల 8వ తేదీ నుంచి ఆగస్టు 26వ తేదీ వరకూ ప్రతి మంగళవారం సాయంత్రం 7-20 గంటలకు బయలుదేరి గురువారం ఉదయం 7-50 గంటలకు అరిసికెరెకు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం.07070) బుధవారాలలో మధ్యాహ్నం 2 గంటలకు అరిసికెరెలో బయలుదేరి గురువారం ఉదయం 7-50 గంటలకు హైదరాబాదుకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు సికింద్రాబాద్, కాచిగూడ, ఉమ్దానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, అనంతపురం ధర్మవరం, హిందూపురం, యలహంక, టుముకూరు స్టేషన్ల మీదుగా వెళ్తుందని వివరించారు. అలాగే కాచిగూడ-తిరుపతి (నం. 07676) ప్రత్యేక సింగిల్ ట్రిప్ రైలు ఈ నెల 8వ తేదీ ఉదయం కాచిగూడలో రాత్రి 11-30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం పన్నెండున్నరకు తిరుపతికి చేరుకుంటుందన్నారు. ఈ రైలు జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట స్టేషన్ల మీదుగా వెళ్తుందని తెలిపారు.

వందే భారత్ రైలుకు అదనపు కోచ్‌లు

కాచిగూడ-యశ్వంతపూర్-కాచిగూడ మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (నం. 20703/04) రైలుకు 8 రైలు కోచ్‌లను పెంచి నడపనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఎనిమిది చైర్‌కార్లతో వెళ్తున్న ఈ వందే భారత్ రైలుకు మరో ఎనిమిది చైర్‌కార్లను జతచేయనున్నట్లు తెలిపారు. ఈ రైలుకు ప్రయాణికుల ఆదరణ ఎక్కువగా ఉండటంతో ప్యాసింజర్ రవాణా సామర్థ్యాన్ని రెండింతలు చేసినట్లు వివరించారు. ఈ నెల 10వ తేదీ నుంచీ వందే భారత్ అప్ అండ్ డౌన్ రైలుకు ఏడు చైర్‌కార్ల స్థానంలో 14, ఒక ఎక్జిక్యూటివ్ క్లాస్ చైర్‌కార్ స్థానంలో రెండు ఉండేలా, 530 ప్రయాణికుల స్థానంలో 1,128 మంది ప్రయాణించేలా సామర్థ్యాన్ని పెంచనున్నట్లు వివరించారు.

8 గంటల ముందే రిజర్వేషన్ చార్ట్

గుంతకల్లు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): భారత రైల్వేలో రిజర్వేషన్ తొలి చార్ట్ తయారీ సమయాన్ని పెంచుతూ దక్షిణ మధ్య రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రైలు బయలుదేరే 4 గంటల ముందు రిజర్వేషన్ తొలి చార్ట్‌ను సిద్ధం చేసి, రైలు బయలుదేరే అర గంట ముందు రెండో చార్టును ప్రకటిస్తున్నారు. దాన్ని సమర్థిస్తూ దక్షిణ మధ్య రై. జోన్ నిబంధనలను అమలుపరిచింది. ఇకపై రైలు బయలుదేరే సమయానికి 8 గంటల ముందు తొలి చార్టును సిద్ధం చేస్తారు. రెండో చార్టు ప్రిపరేషన్ సమయాన్ని యథాప్రకారంగానే కొనసాగించనన్నారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య సమయాలలో బయలేదేరే రైళ్లకు ముందు రోజు రాత్రి 9 గంటలకే తొలి చార్టును ప్రకటిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి అర్ధరాత్రి 11-59 గంటల మధ్య, తెల్లవారుజాము 12 గంటల నుంచి ఉదయం 5 గంటల మధ్యలో బయలుదేరే రైళ్లకు 8 గంటల ముందు తొలి చార్టును ప్రకటిస్తారు.

జేఎన్‌టీయూలో ఏపీఎంసెట్ హెల్ప్‌లైన్ సెంటర్

అనంతపురంరూరల్, జూలై7(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలోని ఏపీజే అబ్దుల్ కలాం భవనంలో ఏపీ ఎంసెట్ హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు వీసీ సుదర్శన్‌రావు సోమవారం తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అడ్మిషన్ల డైరెక్టర్ ఆచార్య సురేష్‌బాబు అందుబాటులో ఉంటారన్నారు. విద్యార్థులు.. సంప్రదించవచ్చన్నారు.

నేడు పుట్టపర్తికి రాజస్థాన్ గవర్నర్ రాక

పుట్టపర్తి టౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ గవర్నర్ హరిబానుబాగ్డే మంగళవారం పుట్టపర్తికి రానున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు గవర్నర్ పుట్టపర్తికి చేరుకుంటారన్నారు. ఆ రోజు పుట్టపర్తిలో బస చేసి, బుధవారం ఉదయం సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటలకు తిరుగు ప్రయాణమవుతారన్నారు. బెంగళూరు వెళ్లి, అక్కడి నుంచి రాజస్థాన్ వెళ్తారన్నారు.

రెండు వర్గాల ఘర్షణ - ఒకరి మృతి

గాండ్లపెంట, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కురుమామిడి పంచాయతీ గుట్టకిందపల్లిలో సోమవారం ఉపాధి హామీ పనుల బిల్లుల కోసం రెండు వర్గాలు ఘర్షణ పడ్డాయి. ఈ ఘర్షణలో రంగారెడ్డి(48) అనే వ్యక్తి మృతిచెందాడు. తనకు ఉపాధి హామీ పనులు కల్పించి, బిల్లులు పెట్టాలని గుట్టకిందపల్లికి చెందిన రంగారెడ్డి కురుమామిడి పంచాయతీకి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మనోహర్‌తో గొడవకుదిగాడు. దీంతో మనోహర్‌తో పాటు దాదెప్ప మరికొంత మంది రంగారెడ్డిపై గుట్టకిందపల్లిలో దాడి చేశారు. ఈ క్రమంలో రంగారెడ్డి అదుపుతప్పి రాయిపై పడడంతో తలకు బలమైన గాయాలై మృతి చెందాడు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి వివాహం కాలేదు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని సీఐ నాగేంద్ర తెలిపారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించండి

● జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): రైతులు సకాలంలో పంటల బీమాకు ప్రీమియం చెల్లించి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై), వాతావరణ ఆధారిత పంటల బీమా కోసం రైతులు ప్రీమియం మొత్తాన్ని చెల్లించాలన్నారు. ఎంపిక చేసిన పంటలను పండించే రైతులు, కౌలు రైతులు రెండు పథకాలకు అర్హులని అన్నారు. నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్‌లో ఈ ఏడాది ఖరీఫ్ నుంచి నమోదు చేసుకోవచ్చన్నారు. బ్యాంకులో పంట రుణం పొందిన రైతులతో రుణం నుంచి ప్రీమియం సొమ్ము బీమా కోసం జమ చేస్తారని అన్నారు. రుణం తీసుకోని రైతులు స్వతహాగా కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా, ఎన్‌సీఐపీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకు ఆధార్, భూమి పత్రాలు, కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డు, రైతు డిక్లరేషన్ లేనిపక్షంలో పంట వేసినట్లు ధ్రువీకరణ పత్రాన్ని ఆర్‌ఎస్‌కే సిబ్బందితో తీసుకోవాలన్నారు. ఈ పంట నమోదు చేసుకున్న పత్రం, సెల్ నెంబర్, రైతు సేవింగ్ ఖాతా వివరాలు అవసరం అన్నారు.

ప్రధాన మంత్రి ఫసల్ బీమా ఇలా..

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ప్రీమియం వివరాలు...

పంట పేరు	బీమా మొత్తం(హె)	రైతు చెల్లించాల్సిన మొత్తం		గడువు తేదీ
		ఎకరాకు	హెక్టారుకు	
కంది	50,000	80	200	జూలై 31
వరి	1,02,500	164	410	ఆగస్టు 15
జొన్న	52,500	84	210	జూలై 31
మొక్కజొన్న	82,500	132	330	జూలై 31
ఆముదం	50,000	80	200	జూలై 31
ఎండు మిరప	2,25,000	576	1400	జూలై 31

ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం కింద కంది పంటను గ్రామం యూనిట్‌గా, వరి, జొన్న, మొక్కజొన్న, ఆముదం, ఎండు మిరప పంటలను మండలం యూనిట్‌గా పరిగణించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. దిగుబడి ఆధారిత పంటల విషయంలో పంట కోత ప్రయోగాల ద్వారా లెక్కించిన వాస్తవ దిగుబడిని.. గత ఏడు సంవత్సరాల దిగుబడి ఆధారంగా లెక్కించి, దిగుబడి తగ్గినప్పుడు బీమా వర్తింపజేస్తారు.

మండలం యూనిట్‌గా వాతావరణ బీమా

వాతావరణ ఆధారిత బీమా ప్రీమియం వివరాలు..

పంట పేరు	బీమా మొత్తం(హె)	రైతు చెల్లించాల్సిన మొత్తం		గడువు తేదీ
		ఎకరాకు	హెక్టారుకు	
వేరుశనగ	80,000	640	1600	జూలై 15
పత్తి	95,000	1140	1600	జూలై 15
దానిమ్మ	1,87,500	3,750	9,375	జూలై 15
చీనీ	1,37,500	2,750	6,875	జూలై 15
టమోటా	80,000	1600	4,000	జూలై 15
అరటి	1,50,000	3,000	7,500	జూలై 15

వాతావరణ ఆధారిత బీమా కింద జిల్లాలో వేరుశనగ, పత్తి, దానిమ్మ, చీనీ, టమోటా, అరటి పంటలకు వర్తింపజేశారు. ఆయా పంటలను మండలం యూనిట్‌గా పరిగణించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లాలో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తారు. ఈ ఏడాది జూలై 1 వతేదీ నుంచి వచ్చే ఏడాది మే నెలాఖరుదాకా ఏడాది కాలం వ్యవధిలో అల్ప, అధిక వర్షపాతం, గాలిలో తేమ శాతం, గాలి వేగం, అధిక ఉష్ణోగ్రతలకు సంబంధించిన పరిణామాలను మండల స్థాయిలో వాతావరణ పరికరాల సహాయంతో లెక్కించి, బీమాను వర్తింపజేస్తారు.

పొలాలకు దారి చూపండి

● మహిళా రైతుల డిమాండ్
● తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన


తహసీల్దార్, సర్వేయర్లతో వాగ్వాదానికి దిగిన మహిళా రైతులు

గోరంట్ల, జూలై7(ఆంధ్రజ్యోతి): తమ పొలాలకు దారి చూపాలంటూ మండలంలోని దిగువగంగంపల్లికి చెందిన మహిళా రైతులు.. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ.. గ్రామం నుంచి పొలాల్లోకి వెళ్లేందుకు పూర్వం నుంచి రోడ్డు ఉందన్నారు. గొల్ల రామకిష్టప్ప సర్వే నంబరు 47లోని రోడ్డు స్థలాన్ని ఆక్రమించుకోవడంతో ఏడాదిగా ఇబ్బంది పడుతున్నామన్నారు. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకపోయిందన్నారు. సమస్యపై తహసీల్దార్ మారుతికి ఫిర్యాదు చేశారు. సర్వేయర్ తాతయ్యను పిలిపించి రెవెన్యూ రికార్డుల మేరకు దారి చూపాలని ఆదేశించారు. దీంతో మహిళలు ఆగ్రహిస్తూ గతంలో అనేకమార్లు రెవెన్యూ అధికారులు రోడ్డు పరిశీలనకు వచ్చినా, సమస్య పరిష్కారం కాలేదంటూ సర్వేయర్‌పై ధ్వజమెత్తారు. మధ్యాహ్నం 3 గంటలకు సర్వేయర్‌తోపాటు పోలీసులు వెళ్లాలని తహసీల్దార్ ఆదేశించారు. మహిళా రైతులు అధికారులు వచ్చేవరకు వెళ్లమంటూ అక్కడే భీష్మించారు. దీంతో సర్వేయర్ వెళ్లి, రోడ్డు చూపారు. ఆందోళనలో మహిళా రైతులు ఈశ్వరమ్మ, వెంకటలక్ష్మమ్మ, అలివేలమ్మ, అనసూయమ్మ, రామచంద్రమ్మ, రజిని, లక్ష్మీనరసమ్మ, శివమ్మ పాల్గొన్నారు.

అరటి పరిశోధనా కేంద్రానికి స్థల పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

తాడిపత్రి, జూలై 7(ఆంధ్రజ్యోతి): అరటికి సంబంధించి టిష్యుకల్చర్ మొక్కల ఉత్పత్తి పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు తాడిపత్రి మండలం తలారిచెరువులో కలెక్టర్ వినోద్‌కుమార్, ఢిల్లీ డీఏఎస్ఎస్ఎల్ ప్రతినిధి పరేష్‌దేశాయ్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రతినిధి జయప్రకాష్ బృందంతో స్థలాన్ని పరిశీలించారు. తలారిచెరువు సర్వేనెంబరు 18లో అనుకూలమైన వాతావరణంగా ఉందని ఇక్కడే ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. బీఏఎస్ఎస్ఎస్ఐ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లో వివిధ పంటల విత్తనాభివృద్ధి కి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రతిపాదన పంపించామని అన్నారు. ముఖ్యంగా అరటి టిష్యుకల్చర్ మొక్కల ఉత్పత్తి పరిశోధన కేంద్రం అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేయుటకు అన్నివిధాలా అనుకూలమైన స్థలమని పరిశీలించారు. 50ఎకరాల అరటి టిష్యుకల్చర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలుతీసుకుంటామని కలెక్టర్ వారికి తెలిపారు. ప్రస్తుతం స్థలాలు ఉన్న ప్రాంతంలో నీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, రోడ్డు వసతి, నేల సామర్థ్యం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. ఇక్కడ టిష్యుకల్చర్ అరటి ఉత్పత్తి కేంద్రం ఏర్పడితే రైతులకు నాణ్యమైన పరిశోధనాత్మకమైన పంట మొక్కలు అందించేందుకు అన్నివిధాలా వీలుంటుందని అన్నారు. తాడిపత్రి ప్రాంతం నుంచి అరటిపంట ఎక్కువ సాగు చేయడంతోపాటు వివిధ దేశాలకు పంపించేందుకు రైల్వేసౌకర్యం కూడా ఉందని బృందానికి వివరించారు. కార్యక్రమంలో తెలుగురాష్ట్రాల ప్రతినిధి తివారీ, ఆర్డీఓ కేశవనాయుడు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఉమాదేవి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ సోమశేఖర్, మండల సర్వేయర్ రాంమోహన్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు తప్పనిసరి

● రాష్ట్ర పరిశీలన బృందం


కదిరి ఎంఈఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న బృందం

కదిరి, జూలై 7(ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు హాజరైన ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని రాష్ట్ర పరిశీలన బృందం సభ్యులు పేర్కొన్నారు. సోమవారం కదిరి, నల్లమాడ, తనకల్లు, నల్లచెరువు, తలుపుల మండలాల్లో ఈ బృందం సభ్యులు తనిఖీలు చేశారు. హాజరు నమోదులో సమస్యలు ఉంటే అప్పటికప్పుడు పరిష్కరించారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పాఠశాలలకు హాజరైన ఉపాధ్యాయులు, విద్యార్థులు తప్పకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. దీనిపై ఎంఈఓలు ఉదయం, సాయంత్రం పర్యవేక్షించాలని అన్నారు. 1, 6 తరగతుల్లో అడ్మిషన్ల వివరాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం ఎంతమందికి ఇస్తున్నారు, పాఠశాలకు ఎంతమంది హాజరయ్యాన్న విషయాలను తనిఖీ చేశారు. హాజరు నమోదు చేయనివారిపై చర్యలుంటాయని తెలిపారు. ఈ బృందంలో సభ్యులు వి. సువర్ణసరోజ, ఎస్‌కే నాగులమీరా, యేసుబాబు, ప్రకాష్‌రెడ్డితోపాటు కదిరి ఎంఈఓలు చెన్నక్రిష్ణ, ఓబులరెడ్డి ఉన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఏడీ-2 వినయ్‌కుమార్‌తోపాటు, అసిస్టెంట్ జీసీడీఓ సంపూర్ణ సోమవారం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థినులకు ఉచితంగా అందించే శానిటరీ న్యాప్‌కిన్స్ గోడౌన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో విద్యాశాఖ ప్రతినిధులు లోకేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మరువ, నడిమివంకలకు రక్షణ గోడలు

- ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం
- త్వరలోనే పనులు ప్రారంభిస్తాం
- సుపరిపాలనకు తొలిఅడుగులో ఎమ్మెల్యే దగ్గుపాటి


ప్రజలకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

అనంతపురం క్రైం, జూలై 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని మరువవంక, నడిమివంకకు ప్రొటెక్షన్ వాల్స్ నిర్మిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ తెలిపారు. దీంతో ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఇక ఎలాంటి బెంగ ఉండదని అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నగరంలోని 19వ డివిజన్‌లో గల సాయినగర్, సూర్యానగర్ కొట్టాల ప్రాంతాల్లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలను పంచుతూ ఏడాది పాలనపై వివరించారు. అలాగే అక్కడి సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మరువవంక సమస్యను కొందరు తెలపడంతో.. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నడిమివంక, మరువవంకకు త్వరలోనే ప్రొటెక్షన్ వాల్స్ నిర్మిస్తామన్నారు. ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఇళ్ల పట్టాలు, ఇళ్లు నిర్మాణం కోసం వచ్చిన విన్నపాలు కూడా పరిశీలించి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఏడాదిలోనే సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయడంతో ప్రజ ల్లో హర్షం వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బాలాంజనేయులు, డివిజన్ నేతలు లక్ష్మీదేవమ్మ, ఓబుళరెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు గడ్డం సుబ్రమణ్యం, గంగారాం, ఆదినారాయణ, జేఎల్ మురళి, రాయల్ మురళి, సింగవరం రవి, గౌస్ మొద్దీన్, పరమేశ్వర్, కొండన్న, సరిపూటి రమణ, నాగన్న, వెంకటేష్, వెంకటనారాయణ, లక్ష్మీనరసింహ, సుధాకర్ యాదవ్, తేజస్విని, నాగభూషణం, మోహన్‌కుమార్, ఫిరోజ్ అహ్మద్, కృష్ణకుమార్, నెట్టెం బాలకృష్ణ, మున్వర్, స్వామిదాస్, గోపాల్‌గౌడ్, సరళ, దుర్గేష్, ప్రకాష్, మల్లికార్జున, శ్రీకాంత్, రమాదేవి, భవానీ, ఆయేషా, మణిరవి, పవన్‌కుమార్, గంగవరం బుజ్జి, సుధాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలని బైక్ ర్యాలీ


ర్యాలీ చేస్తున్న ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు

అనంతపురం విద్య, జూలై 7(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌ను రద్దు చేయాలన్న డిమాండ్‌తో ఈనెల 9వ తేదీన చేపట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు నగరంలోని సోమవారం వారు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎన్జీఓ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభించి నగరమంతా తిరిగారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజారెడ్డి, సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి నాగేంద్ర, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, వైఎస్ఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఓబురెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్, జిల్లాకోశాధికారిగోపాల్, నాయకులు పాల్గొన్నారు.

●అనంతపురంరూరల్: ఈనెల 9న దేశవ్యాప్త సమ్మెను చేపట్టనున్నామని, విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని కందుకూరు గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగులసంస్థలో హమాలీలతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. మేస్త్రీలు గోపాల్, ఆదినారాయణ, రామ్మోహన్, వెంకటరాముడు, పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

●రాప్తాడు: దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పోస్టర్లు విడుదల చేశారు.

ల్యాప్‌టాప్ అప్పగింత

చెన్నేకొత్తపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తుండగా కనిపించకుండా పోయిన ల్యాప్‌టాప్‌ను తిరిగి పోలీసులు ఆమెకు అప్పగించారు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తేజస్విని అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆదివారం బెంగళూర్ నుంచి ఆర్టీసీ బస్సులో అనంతపురం వెళ్తోంది. రాప్తాడు వద్దకు రాగానే తన వెంట తెచ్చుకున్న ల్యాబ్‌ట్యాప్,లగేజీ బ్యాగును చూసుకోగా కనిపించలేదు. వెంటనే అనంతపురానికి చేరుకుని ఆమె తన సోదరుడికి ఫోన్‌చేసి విషయాన్ని తెలిపింది. అతను రావడంతో ఇద్దరూ చెన్నేకొత్తపల్లికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బస్సు ఎన్ఎస్‌గేటులో ఆగిన సమయంలో అక్కడ కొందరు ప్రయాణికులు దిగారని వారే తన ల్యాప్‌టాప్ తీసుకెళ్లి ఉంటారని అనుమానాన్ని పోలీసుల ఎదుట వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సీకేపల్లిలో ఏకాదశి ఉత్సవాలు జరుగుతుండటంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఎక్కువగా వచ్చారని తెలుసుకున్న పోలీసులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. ఉత్సవ నిర్వాహకులకు సమాచారం అందించి అక్కడ ఈ ల్యాబ్‌ట్యాబ్ పోయిన విషయాన్ని మైకులో అనౌన్స్ చేయించారు. కొద్దిసేపటికి బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి ల్యాబ్‌ట్యాప్‌ను లగేజీ బ్యాగును పోలీసు స్టేషన్‌కు చేరుకుని అప్పగించారు. పోలీసులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి సమాచారం ఇచ్చి సోమవారం వాటిని ఆమెకు అప్పగించారు.

నేడు పండ్ల మొక్కలు నాటే కార్యక్రమం

రాప్తాడు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం ద్వారా మండల వ్యాప్తంగా మంగళ వారం 147 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి సోమవారం ప్రకటనలో తెలిపారు. రామినేపల్లి గ్రామంలో మహిళారైతు శ్యామలకు చెందిన పొలంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు మొక్కలు నాటనున్నట్లు చెప్పారు.

సజావుగా ఇంటర్వ్యూలు

కనగానపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో సోమవారం ఆశా కార్యకర్తలకు ఇంటర్వ్యూలు సజావుగా జరిగాయి. కనగానపల్లితోపాటు తూముచెర్ల గ్రామానికి సంబంధించి ఆశా కార్యకర్తల పోస్టులకు వైద్యాధికారులు దరఖాస్తులు స్వీకరించారు. తర్వాత దరఖాస్తుదారులకు వైద్యాధికారి చెన్నారెడ్డి, ఇతర వైద్యబృందం ఇంటర్వ్యూలు చేశారు. కనగానపల్లి ఆశా కార్యకర్త పోస్టుకు ఏడుగురు, తూముచెర్లకు ఇద్దరు చొప్పున హాజరయ్యారని వైద్యాధికారి తెలిపారు.

లోపలికి వెళ్లాలంటే భయం.. భయం

- శిథిలావస్థలో బీసీ స్టడీసర్కిల్ గ్రంథాలయ భవనం
- పెచ్చులూడుతుండడంతో లోపలికి వెళ్లాలంటే భయపడుతున్న పాఠకులు


బీసీ స్టడీసర్కిల్ గ్రంథాలయ భవనంలో ఊడిన పెచ్చులు


లోపలికి వెళ్లకుండా తలుపులు మూసేసిన దృశ్యం

ఆంధ్రజ్యోతి విజిట్

అనంతపురం విద్య, జూలై7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బీసీ స్టడీసర్కిల్‌లో ఉన్న గ్రంథాలయాన్ని నిరుద్యోగ యువత దేవాలయంగా భావిస్తారు. ఎన్నోకాంపిటేటివ్ పరీక్షలకు సంబ ంధించిన అనేక పుస్తకాలను ప్రభుత్వం ఇక్కడ అందుబాటులో ఉంచింది. ఉద్యోగాలకు పోటీపడే నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ కూడా ఇక్కడ ఇవ్వడం జరుగుతోంది. అలాంటి గ్రంథాలయ భవనంలోకి వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆ భవనం పూర్తిగా దెబ్బతిని శిథిలావస్థకు చేరుతోంది. ముఖ్యంగా పైభాగం సిమెంట్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. ఇప్పటికే అక్క డ చదువుతున్న నిరుద్యోగులపై అనేకసార్లు పెచ్చులూడి పడ్డాయని, అప్రమత్తంగా ఉండి వాళ్ల తప్పించుకున్నారని, అందుకే పక్కనున్న భవనంలోకి పాఠకులు చదువుకోవడానికి ఏర్పాట్లు చేశామని లైబ్రేరియన్ అంటున్నారు. పుస్తకాలను మాత్రం ఆ గ్రంథాలయ గదిలోనే ఉంచారు. ఎవరైనా ఏదేని పుస్తకం కావాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని లోపలికి భయంభయంగా వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. ఇదంతా సంబంధిత బీసీసంక్షేమశాఖ అధికారులకు తెలుసు. ఏటా కోట్ల రూపాయలు బీసీసంక్షమ శాఖ ద్వారా విద్యారంగానికి ఖర్చు చేస్తున్నారు. ఇక్కడ నిరుద్యోగులకు ఎంతో ఉపయోగపడుతున్న బీసీస్టడీసర్కిల్‌లో ఉన్న గ్రంథాలయం గురించి మాత్రం పట్టించుకోకపోవడం బాధాకరం. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి ఈసర్కిల్‌లో ఉన్న గ్రంథాలయ భవనాన్ని మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ముగిసిన లక్ష్మీనారసింహుడి బ్రహ్మోత్సవాలు

- పూల పల్లకిపై ఊరేగిన స్వామివారు

చెన్నేకొత్తపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీలో అహోబిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. తొలిఏకాదశిని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తిని ప్రత్యేక పూలపల్లకిపై ఉంచి గ్రామ ప్రధాన వీధులగుండా ఊరేగించారు. శ్రీవారితో పాటు పలు దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ సందర్భంగా వీధులన్నీ భక్తుల గోవింద నామస్మరణతో మారుమ్రోగాయి. తెల్లవారుజామున 2గంటలకు ప్రారంభమైన ఊరేగింపు తెల్లవారేలోపు ఆలయం వద్దకు చేరుకుంది. ఉదయం ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో పెద్దఎత్తున దాసంగం నిర్వహించారు. సాయంత్రం భక్తులు మొక్కులు తీర్చుకోవడంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. టీడీపీ సీనియర్ నేత ఎల్ నారాయణచౌదరి స్వామి వారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

కొండమీద లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో..

మండలంలోని ఎర్రజిన్నన్నగారిపల్లి సమీపంలో కొండ మీద వెలసిన లక్ష్మీనరసింహస్వామిసన్నిధిలో తొలి ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశా రు. చుట్టుపక్కల గ్రామాలనుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ పరుష నిర్వహించారు.


కనుమలో ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి

నేత్రపర్వంగా వెంకటేశ్వరుడి కల్యాణోత్సవం..

తొలిఏకాదశిని పురస్కరించుకుని కనుమలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కన్నులపండువగాసాగింది. వేదపండితులు ఆలయం ఆవరణలో అమ్మవార్ల సమేత సామివారి ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణాన్ని జరిపించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

శ్రీచైతన్యలో గ్రీన్ ఇండియా


మొక్కలు నాటుతున్న ఏజీఎం తదితరులు

అనంతపురం విద్య, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కమ్మభవన్ వద్ద ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం గ్రీన్‌ఇండియా మిషన్ కార్యక్రమాన్ని సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి అక్కడి విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆమొక్కలను తామే రక్షించుకుంటామని విద్యార్థుల చేత ఏజీఎం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశ్వనాథ్, డీన్‌లు చిన్నకృష్ణారెడ్డి, భవిత, కోఆర్డినేటర్ రాధాకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు చెర్లోపల్లిలో ఎమ్మెల్యే పర్యటన

రామగిరి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే పరిటాలసునీత పర్యటించనున్నారని, అక్కడ ఉపాధి హామీ పథకం కింద ఓ రైతు పొలంలో చేపట్టిన పండ్ల మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారని ఉపాధి ఏపీఓ శంకర్, పోలేపల్లి టీడీపీ గ్రామ కమిటీ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9గంటలకు ఎమ్మెల్యే రానున్నారని స్థానిక టీడీపీ నాయకులు, రైతులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా తొలి ఏకాదశి

కనగానపల్లి, జులై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో తొలి ఏకాదశి పండుగను ఘనంగా జరిపారు. తొలి ఏకాదశి రెండో రోజైన సోమవారం కుర్లపల్లి సమీపంలో కొండపై ఉన్న వారాదయ్యస్వామి(ఆంజనేయస్వామి)కి అర్చకులు ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించారు. పెద్దలు, పిల్లలు కొండపైకి నడిచి వెళ్లి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మామిళ్లపల్లి గ్రామంలో లక్ష్మీనరసింహాలయంలో ప్రత్యేక పూజలు జరిపి అన్నదానం చేశారు.

మన్నీలలో వైద్యశిబిరం

అనంతపురంరూరల్, జూలై7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నీల గ్రామంలో విషజ్వరాల వ్యాప్తిపై ఆంధ్రజ్యోతిలో గత ఆదివారం కథనం ప్రచురించిన విషయం విదితమే. స్పందించిన మండల వైద్యాధికారులు గ్రామంలో సోమవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారిణి సంధ్య, వైద్య సిబ్బంది కలిసి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 70మందికి డెంగీ, మలేరియా పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా ఎంపీడీఓ దివాకర్, డిప్యూటీ ఎంపీడీఓ గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. సర్పంచు త్రిలోక్‌నాయుడు, పంచాయతీకార్యదర్శి హైమావతి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి


ఈశ్వరయ్య మృతదేహం

అనంతపురం క్రైం, జూలై 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కళ్యాణదుర్గం రోడ్డులో గుర్తు తెలియని బైక్ ఢీకొట్టడంతో ధర్మవరానికి చెందిన ఈశ్వరయ్య(54) మరణించాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈశ్వరయ్య నగరంలోని ఓ వ్యక్తి నుంచి ఆకుకూరలు కొనుగోలు చేసి, వాటిని కాలనీల్లో విక్రయించి జీవనం సాగిస్తుండేవాడు. సోమవారం రాత్రి కళ్యాణదుర్గం బైపాస్‌లో గుర్తుతెలియని బైక్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఢీకొన్న వాహనదారుడి వివరాలు తెలియాల్సి ఉంది. ట్రాఫిక్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని గుర్తించే పనిలో ఉన్నారు.

పొలంలో శిశువు మృతదేహం

గార్లదిన్నె, జూలై 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మ కాలనీ సమీపాన పొలంలో సోమవారం శిశువు మృతదేహం లభించింది. కాకులు గుమిగూడి సంచరిస్తుండడంతో స్థానికులు వెళ్లి చూడగా.. నెలలు నిండని శిశువు మృతదేహం కనిపించింది. అయవాలు కూడా ఏర్పడకపోవడంతో అబార్షన్ చేయించుకుని మృతదేహాన్ని పడివేసి వేళ్లారా...? స్థానికులే ఎవరైనా వదిలేశారా...? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీఆర్వో రవిశంకర్.. శిశువు మృతదేహాన్ని పరిశీలించారు. పంచాయతీ కార్మికులతో ఖననం చేయించారు.

గుండెపోటుతో సుంకిరెడ్డి తాత మృతి


సుంకిరెడ్డి తాత (ఫైల్)

శింగనమల, జూలై7(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికవేత్త రామయ్యతాత శిష్యుడు, రామయ్యతాత ఆలయ పూజారి సుంకిరెడ్డి తాత(67) గుండెపోటుతో సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. మండలంలోని మట్లగొంది శివారులో ఉన్న రామయ్య తాత ఆ లయానికి సుంకిరెడ్డి ఎన్నోఏళ్లుగా పూజారిగా సేవలందిస్తున్నారు. భక్తులు ఆయన్ను సుంకిరెడ్డి తాతా అని పిలుస్తారు. కాగా ఆయనకు సోమవారం గుండెనొప్పి రావడంతో కుటుంబసభ్యులు, భక్తులు శింగనమల ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందారు. సుంకిరెడ్డి తాత మృతితో పెద్ద మట్లగొంది,చిన్నమట్లగొంది గ్రామాల ప్రజలు శోకసముద్రం మునిగిపోయారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

గార్లదిన్నె, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తలగాసిపల్లి క్రాస్ జంక్షన్ వద్ద 44వ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సోముల దొడ్డికి చెందిన సురేంద్ర, అంజి గుంతకల్లులో మొహర్రం వేడుకలు చూసేందుకు బైక్‌లో వెళ్లారు. అనంతరం తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. అయితే తలగాసిపల్లి వద్దకు రాగానే వారి బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

- పలు ప్రాంతాల్లో జలధికి తరలిన పీర్లు

బుక్కరాయసముద్రం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం తో పాటు 19 గ్రామ పంచాయతీల్లో ప్రజలు సోమవారం మొహర్రం వేడుకలను కులమతాలకు అతీతంగా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మం డల కేంద్రంలో ఉదయాన్నే ముజావర్లు పీర్లను గ్రా మంలో ఊరేగించారు. అనంతరం చావిడి ఎదుట అగ్నిగుండ ప్రవేశం చేయించారు. భక్తులు భారీ ఎత్తున పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ పుల్లన్న పోలీసు బందోబస్తు నిర్వహించారు.

●కనగానపల్లి: మండలకేంద్రంతో పాటు యలకుంట్ల గ్రామంలో పీర్లు సోమవారం జలధికి తరలాయి. ఉయదమే అగ్నిగుండం ప్రవేశం చేయించారు. భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి చక్కెర చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. తర్వాత సాయంత్రం ఊరేగింపుగా జలధికి తరలించారు.

●శింగనమల: మండల కేంద్రంలో పీర్లను సోమవారం తెల్లవారుజామున అగ్నిగుండ ప్రవేశం చేయించారు. తర్వాత ఊరేగింపు చేశారు. అందులో గొల్లవీధిలో చిన్న వెండిదేవుడి పీరు, చిన్నఅక్బర్ పీరు ఒక చోట బేటీ కావడాన్ని ప్రజలు పెద్దఎత్తున తిలకించారు. చక్కెర చదివింపులు చేయించారు. తర్వాత పీర్లను జలధికి తరలించారు.

●రాప్తాడు: మండలంలోని గొందిరెడ్డిపల్లి, గంగలకుంట గ్రామాల్లో వైభవంగా జలధి కార్యక్రమం నిర్వహించారు. ఉదయమే పీర్లను అగ్ని గుండ ప్రవేశం చేయించారు. సాయంత్రం గ్రామ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. యువకులు ఉల్లాసంగా అలావు తొక్కారు. అనంతరం గుండం పూడ్చి వేసి పీర్లను జలధికి తరలించారు. అలాగే బండమీదపల్లి, బోగినేపల్లి గ్రామాల్లో పెద్ద సరిగెత్తును ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున పీర్లను ఊరేగించారు. సాయంత్రం గ్రామస్థులు చెక్కర చదివింపులు చేయించారు. చావిడిల ఎదుట గుండాలను పెద్దపెద్ద మొద్దులు వేసి అంటించారు.

● గార్లదిన్నె: మండలకేంద్రంలో సోమవారం పెద్దసరిగెత్తు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పీర్ల చావిడి ఎదుట అగ్నిగుండాన్ని వెలించారు. భక్తులు భారీ సంఖ్యలో పీర్ల వద్ద చెక్కెర చదివింపులు చేయించి ప్రార్థనలు చేశారు.


బుక్కరాయసముద్రంలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం


రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లిలో..


కనగానపల్లిలో..


శింగనమలలో ..

ప్లాస్టిక్ విక్రయించే షాపులపై దాడులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏపీ పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ప్లాస్టిక్ విక్రయించే షాపులపై సోమవారం దాడులు నిర్వహించారు. ఏపీ పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ బీవై మునిప్రసాద్ నేతృత్వంలో నగరంలోని పాతూరు గుత్తిరోడ్డు, కళ్యాణదుర్గం రోడ్డు, బళ్లారి రోడ్డు, రుద్రంపేట బైపాస్, ఆర్టీసీ బస్టాండ్, రాజురోడ్డు తదితర ప్రాంతాలలో తనిఖీలు చేశారు. నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తయారీకి మొదటి నేరం కింద వాయుపుత్ర ఎంటర్‌ప్రైజెస్, ఎంఎస్ ఆక్వా వాటర్‌కు రూ. 50వేలు, రేఖ ట్రేడింగ్, మెట్రో ప్లాస్టిక్‌క రూ. 20 వేలు జరిమానా విధించారు. అలాగే సుమారు వంద కిలోల ప్లాస్టిక్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

భూసమస్యకు పరిష్కారం చూపలేదు

- నెలలు తరబడి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా.. ఫలితం శూన్యం ● ఓ రైతు ఆవేదన


బాధిత రైతు పురుషోత్తం రెడ్డి

శింగనమల, జూలై 7(ఆంధ్రజ్యోతి): రీసర్వేలో అధికారులు చేసిన తప్పిదం వల్ల తమకు ఉన్న పట్టాభూమి 2.50 ఎకరాలు మరో రైతు పేరుపై ఆన్‌లైన్ అయిందని, ఈ సమస్య పరిష్కారం కోసం నెలలుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నానని, ఎవరూ పట్టించుకోవడం లేదని మండలంలోని వెస్ట్ నరసాపురం గ్రామానికి చెందిన రైతు బసిరెడ్డి పురుషోత్తం రెడ్డి వాపోయారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆయన తన ఆవేదనను వెళ్లగక్కారు. చెన్నవరం రెవెన్యూ పొలంలోని సర్వేనంబర్ 129లో తన తల్లి బసిరెడ్డి సరస్వతి పేరిట 4.54 ఎకరాలు, భార్య సులోచన పేరిట 4 ఎకరాల భూమి ఉందని, అయితే గత మూడేళ్ల కిందట వైసీపీ పాలనలో చేసిన రీసర్వేలో అధికారులు తన తల్లిపేరు మీద ఉన్న 4.54 ఎకరాలను 3.04 ఎకరాలుగా, భార్య పేరు మీద ఉన్న 4ఎకరాలను 3ఎకరాలుగా నమోదు చేసి అదే గ్రామానికి చెందిన మరొక రైతు పేరుపై 2.50 ఎకరాలు నమోదు చేసి భూహక్కుపుస్తకం ఇచ్చారన్నారు. ఆ తప్పిదాన్ని సరిదిద్దాలని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. గార్లదిన్నె మండలంలో గత ఏప్రిల్ 30న జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి సమస్యను తెలిపి పరిష్కరించాలని కోరామన్నారు. వెంటనే వారు సమస్యను పరిష్కరించాలని శింగనమల తహసీల్దార్‌కు అర్జీని పంపారన్నారు. అయితే ఇప్పటి వరకు కూడా తహసీల్దార్ సమస్యను పట్టించుకోలేదని వాపోయారు. కార్యాయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా.. స్పందించడం లేదని, రేపు, మరునాడు అంటూ రెవెన్యూ అధికారులు తిప్పుతున్నారని అన్నారు. ఇప్పటికైనా పరిష్కరించాలని కోరారు.

విజయసాయికి భారత్ గౌరవ్ సమ్మాన్ అవార్డు

అనంతపురం టౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ భారత్ గౌరవ్ సమ్మాన్ అవార్డు అందుకున్నారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ్‌రాజ్‌కు చెందిన జన జాగృతి సేవా సమితివారు విజయసాయికుమార్‌ను ఆ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో ఇస్కాన్‌కు చెందిన ప్రణవానందదాస్ స్వామీజీ చేతులమీదుగా విజయసాయికుమార్‌కు అవార్డును అందజేసి సత్కరించారు. జనజాగృతి సేవాసమితి నిర్వాహకుడు ప్రదీప్‌కుమార్, ఇస్కాన్ ప్రతినిధి శ్రీకాంత్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని వినూత్న నిరసన



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ కార్మికులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కా ర్మికులకు వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట యంత్రాలు, పనిముట్లతో వినూత్న నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్‌గౌడ్ , జిల్లా కోశాధికారి వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు నాగరాజు, నాయకులు ప్రసాద్, రామాంజి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి మాజీ సైనికుడు

నార్పల,జూలై7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సీఆర్‌పీఎఫ్ మాజీ జవాన్ కాశీ నాగేంద్ర సోమవారం బీజేపీలోకి చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు దామోదర ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకోగా.. వారు ఆయనకు కాషాయ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

రామగిరి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరులో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు జెండాను ఆవిష్కరించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కలుపుకుని మాదిగ దండోరా ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బడగొర్ల అంజనప్ప, సాగునీటి సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, టీడీపీ మండ ల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి అవుల ముత్యాలు, దండోరా నాయకుడు శ్రీరాములు, మాజీ సర్పంచ్ గంగాధర్ పాల్గొన్నారు.

ఘనంగా మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు

అనంతపురం వైద్యం: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ 60వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఇతర అనుబంధ సంఘాల నాయకులు సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఎంఈఎఫ్ నాయకులు శంకర్, గంగాధర్, సుబ్బారావు, హరిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ఆర్థికసాయం


బాధితుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందచేస్తున్న ముంటిమడుగు కేశవరెడ్డి

గార్లదిన్నె, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు గాయపడి అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న నార్పల భాస్కర్‌ను ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి సోమవారం పరామర్శించారు. అనంతరం వైద్యం ఖర్చులకు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రవి రాజు, రాప్తాడు ఎస్సీసెల్ అధ్యక్షుడు ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ఆవు దూడకు సర్జరీ

రాప్తాడు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మూత్ర విసర్జన పేగు మూసుకుపోయి జన్మించిన ఆవు దూడకు బండమీదపల్లి పశు వైద్యాధికారి సోమేశ్వరి అరుదైన సర్జరీ చేశారు. బండమీదపల్లిలో రైతు బింగి బోడమల్లుకు చెందిన పాడి ఆవు ఆదివారం రాత్రి పెయ్యదూడకు జన్మనిచ్చింది. అది మూత్ర విసర్జన పేగు మూసుకుపోయి జన్మించడంతో అనారోగ్యానికి గురైంది. రైతు సోమవారం గ్రామంలోని పశువుల ఆసుపత్రికి తీసుకెళ్లగా పశు వైద్యాధికారి సోమేశ్వరి అరుదైన సర్జరీ చేసి సమస్య పరిష్కరించారు. పశువైద్య కార్యాలయ సిబ్బంది వెంకటేశు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఆర్టీసీ స్థలం పరిశీలన

పామిడి, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ స్థలం అన్యాక్రాంతమవుతోందని పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు. బస్టాండ్ స్థలాన్ని పక్కాగా కొలతలు వేయించి ప్రహరీ నిర్మించాలని ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ ఆర్ ఆదోనికి సూచించారు. బస్టాండ్ ఆవరణంలోని అపరిశుభ్రతను వారంలోగా పూర్తిగా తొలగించాలని, మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించాలని అన్నారు. వారి వెంట సీటీఎం శ్రీలక్ష్మి, డీఎం కే గంగాధర్, ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాలకు న్యాక్ గ్రేడ్

గుంతకల్లుటౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలకు రెండవ సారి న్యాక్ గ్రేడ్ మంజూరైనట్లు కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్, చైర్మన్ డీఏ మురళీకృష్ణ సోమవారం తెలిపారు. న్యాక్ గ్రేడ్ రావడానికి సహకారాన్ని అందించిన డాక్టర్ నటరాజ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల సభ్యులు ఎంసీ బాలయ్య, కళాశాల డైరెక్టర్ పీ గోపాల్, ప్రిన్సిపాల్ ఆర్ సురేష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కురుబ మల్లన్నకు కన్వీనర్ బాధ్యతలు ఇవ్వాలి

బొమ్మనహాళ్, జూలై 7(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపుకోసం కృషి చేసిన మండలంలోని ఉంతకల్లు గ్రామానికి కురుబ మల్లన్నకు టీడీపీ మండల కన్వీనర్ బాధ్యతలు ఇవ్వాలని మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్, కురుబ సంఘం అధ్యక్షులు నాగరాజు సోమవారం కోరారు. మల్లన్నకు ఆ పదవి రాకుండా గ్రామంలోని కురుబ సామాజిక వర్గానికి చెందిన కొందరు అడ్డు తగలడం పద్ధతి కాదన్నారు.

నగరవనం పరిశీలన

రాయదుర్గంరూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని నగరవనాన్ని అడిషనల్ పీసీసీఎఫ్ డీఎఫ్ఓ విజ్ఞాష్ అపోవ్ సోమవారం పరిశీలించారు. టీ వీరాపురం, కొండాపురం, కొంతానపల్లి ఫారెస్ట్‌లలో ఏర్పాటు చేసిన ప్లాంటేషన్‌ను పరిశీలించారు. నగరవనంలో జరుగుతున్న పనులను త్వరితగతిన పనులను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట కళ్యాణదుర్గం డీఆర్ఓ దామోదార్‌రెడ్డి, సుబ్రమణ్యం ఉన్నారు.

ముగ్గురు వీఆర్వోల బదిలీ

యల్లనూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగ్గురు వీఆర్వోలు బదిలీ అయినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ రాము తెలిపారు. చిలమకూరు వీఆర్వో సరళ తాడిపత్రి మండలంలోని చుక్కలూరుకు, యల్లనూరు-2 వీఆర్వో వినోద్‌బాబు భోగసముద్రానికి, బొప్పేపల్లి వీఆర్వో రవి యాడికి మండలానికి బదిలీ అయినట్లు ఆయన తెలిపారు. వీరిస్థానంలో కొత్తవారు రావాల్సి ఉందన్నారు.

యాడికి కాలువ పరిశీలన



కాలువను పరిశీలిస్తున్న హెచ్చెల్సీ అధికారులు

యాడికి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చారుమేకలపల్లి గ్రామం వద్ద యాడికి కాలువను హెచ్చెల్సీ అధికారులు సోమవారం పరిశీలించారు. జూన్ 16న యాడికిలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో యాడికి కాలువలో పూడికతీత, నీటివిడుదలపై స్థానిక రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు హెచ్చెల్సీ అధికారులు ఈ కాలువను పరిశీలించారు. నివేదికను తయారుచేసి కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. పరిశీలించిన వారిలో హెచ్చెల్సీ ఎస్ఈ విశ్వనాథ్‌రెడ్డి, జేఈలు చెన్నారెడ్డి, శివశంకరప్ప ఉన్నారు.

పెద్దారెడ్డిని అడ్డుకుంటాం

తాడిపత్రి, జూలై7(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ఆర్ జయంతి వేడుకల్లో పాల్గొనడానికి వైసీపీ మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, అతని కొడుకులు తాడిపత్రికి వస్తే.. వారిని అడ్డుకుంటామని కౌన్సిలర్లు మల్లికార్జున, విజయ్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పెద్దారెడ్డి అనేకమందిని టీడీపీ కార్యకర్తలను, జేసీ ప్రభాకర్‌రెడ్డిని ఇబ్బందులకు గురిచేశాడని, అందువల్ల ఆయన్ను తాడిపత్రిలో అడుగుపెట్టనీయబోమని తెల్చిచెప్పారు.

ప్రతిభావంత విద్యార్థులకు నగదు బహుమతులు

తాడిపత్రి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపొలమడ, జూటూరు ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తాడిపత్రి ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నగదు బహుమతులను అందజేశారు. 578మార్కులు సాధించిన లావణ్యకు రూ.5వేలు, 574మార్కులు సాధించిన యమున రంజిత్‌గౌడ్‌లకు రూ.3వేలు, 572మార్కులు సాధించిన శృతికి రూ.2వేలు, జూటూరు పాఠశాలలో 556మార్కులు సాధించిన మోక్షితకు రూ.5వేలు, 543మార్కులు సాధించిన నందవర్ధన్‌కు రూ.3వేలు, 542మార్కులు సాధించిన రూ.2వేలు ఇచ్చారు. ఇదే పాఠశాలలో ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ రూ.10వేలు క్లబ్‌కు అందజేశాడు.

ఈఓగా అసిస్టెంట్ కలెక్టర్

కణేకల్లు, జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సచిన్‌రహర్ కణేకల్లు మేజర్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారిగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. పంచాయతీకి సంబంధించి విధులు, బాధ్యతలు తదితర అంశాలపై అవగాహన పొందేందుకు 14 రోజుల పాటు శిక్షణలో భాగంగా ఇక్కడ బాధ్యతలు చేపట్టారు.

విజిలెన్స్ కమిటీ సభ్యురాలిగా విజయలక్ష్మి



గుంతకల్లుటౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ సివిల్ సప్లయ్ విజిలెన్స్ కమిటీ సభ్యురాలిగా పట్టణానికి చెందిన విజయలక్ష్మిని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తూ సోమవారం ఉత్తర్వులను జారీ చేసింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

విజయవాడకు బస్సు సౌకర్యం

గుంతకల్లుటౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు నుంచి విజయవాడకు ఆర్టీసీ బస్సును మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజరు కేవీ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు ఉరవకొండలో సాయంత్రం 6:30 గంటలకు బయలుదేరి గుంతకల్లుకు రాత్రి 7:15 నిమిషాలకు చేరుకుంటుంది. గుంతకల్లు బస్టాండ్ నుంచి రాత్రి 7:30 గంటలకు బయలుదేరి గుత్తి, కర్నూలు మీదుగా విజయవాడకు మరసటి రోజు ఉదయం 6:40 నిమిషాలకు చేరుకుంటుంది. తిరిగి విజయవాడలో రాత్రి 7:30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6:30 గంటలకు గుంతకల్లుకు చేరుకుంటుంది.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లుటౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అనుబంధం నాయకులు సోమవారం నిరసన తెలిపారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీదేవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు చిన్నకొండయ్య, నరసయ్య, ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: ఉరవకొండ, గుత్తిలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేసి కేక్ కట్ చేశారు. కూడేరులో వికలాంగుల సెంటర్‌లో బెడ్లు పంపిణీ చేశారు.

ఎన్నాళ్లీ గుంతల రోడ్లు..?

● బైకుల్లోనూ వెళ్లలేని పరిస్థితి
● ప్రమాదాల బారిన గ్రామీణులు

పుట్లూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏళ్లతరబడి రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. కనీసం బైక్‌ల్లో కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం కనీసం మరమ్మతులకు నిధులు కూడా విడుదల చేయకపోవడంతో.. రోడ్లన్నీ కంకర తేలి మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడ్డాయి. దీంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని పుట్లూరు-తక్కళ్లపల్లి, ఎస్.తిమ్మాపురం- తక్కళ్లపల్లి, చాలవేముల - నారాయణరెడ్డిపల్లి, కడవకల్లు-చింతకుంట, మడ్డిపల్లి మెయిన్‌రోడ్- చాలవేముల తదితర రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. కనీసం వీటికి ప్యాచ్‌వర్క్‌లు కూడా వేసిన పాపాన పోలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడి సంవత్సరమైనా రోడ్లను బాగుచేయకపోవడంతో గ్రామీణులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనిపైన మండల పీఆర్ ఇన్‌చార్జి ఇంజనీర్ నరసింహారెడ్డిని వివరణ కోరగా.. మండలంలో సుమారు 30 కిలోమీటర్ల మేర పంచాయతీరాజ్ తారురోడ్లకు మరమ్మతులు, బీటీ రోడ్లకు ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని తెలిపారు. నూతన రోడ్ల నిర్మాణానికి సంబంధించి అంచనాలు తయారుచేసి పంపించామన్నారు.



దెబ్బతిన్న చాలవేముల-నారాయణరెడ్డిపల్లి రోడ్డు, గుంతలు పడ్డ పుట్లూరు-తక్కళ్లపల్లి రోడ్డు

ప్రతి సమస్యనూ పరిష్కరించాలి: కలెక్టర్



సమస్యలు వింటున్న కలెక్టర్

పామిడి, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం వేదికకు వచ్చిన ప్రతి సమస్యనూ తప్పకుండా పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానికంగా సోమవారం ఆయన ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారం వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో కలెక్టర్‌తో పాటు అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, ఏపీ లేబర్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, డీఆర్వో మలోలా, ఎస్డీసీ మల్లికార్జున, తిప్పేనాయక్, ఆనంద్, రామకృష్ణారెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. మొత్తం 567 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



అన్న క్యాంటీన్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి

ఉరవకొండ, జూలై 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం భూమి పూజ చేశారు. ఉరవకొండలో రూ.7.60 కోట్లతో నిర్మించనున్న ఉరవకొండ- రాయంపల్లి , ఉరవకొండ- పాల్తూరు, కణేకల్లు క్రాస్ రోడ్డు నుంచి మార్కెట్ వరకూ రోడ్డు పనులను ప్రారంభించారు. తహసీల్దారు కార్యాలయంలో ఆవరణంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. పంచాయతీ క్వార్టర్స్‌లో కూరగాయల మార్కెట్ నిర్మాణానికి అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, మాజీ మార్కెట్ యార్డు చైర్మెన్లు రేగాటి నాగరాజు, బీసీ మారెన్న, మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ, మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణ, గౌతమ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి



ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

కూడేరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వ పాఠశాల్లో మీ పిల్లలను చేర్పించండి.. మీ పిల్లల భవిష్యత్తుకు మేమే పునాదులు వేస్తాం. ప్రైవేటు పాఠశాల్లో డబ్బులు కట్టి చదవాలి.. ప్రభుత్వ పాఠశాల్లో అన్ని ఉచితమే. విద్యార్థులకు పుస్తకాలు, బట్టలు, బ్యాగు, బూట్లు, బెల్ట్ తదితర వాటితో పాటు సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం పెడుతున్నాం. తల్లిదండ్రులారా.. ఆలోచించండి..' అంటూ ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కూడేరు మండలం ఇప్పేరు గ్రామంలో సోమవారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఈ మేరకు ప్రచారం చేపట్టారు. ఇందులో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఓబుళపతి, హైస్కూల్ టీచర్ ప్రతాప్, పాఠశాల చైర్మన్ వడ్డే పెద్దిరాజు, ఉపాధ్యాయులు శిరీష, ఇందిర, ఉషారాణి పాల్గొన్నారు.

రక్షణ గోడలు ఏర్పాటు చేయండి



రక్షణగోడలు లేని కల్వర్టు

యల్లనూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి):మండలంలోని యల్లనూరు - గడ్డంవారిపల్లి రహదారిపై యల్లనూరు చెరువు వద్ద కల్వర్టుకు రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దగ్గరకు వచ్చే వరకు కల్వర్టు ఉన్న సంగతే వాహనదారులకు కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజాగా వారం క్రితం అదుపుతప్పి ఈ ప్రదేశంలోనే ఒక ట్రాక్టర్ చెరువులోకి పడిపోయింది. ఇప్పటికైనా పంచాయతీరాజ్‌శాఖ అధికారులు ఈ కల్వర్టుకు రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

జనసేన సమన్వయకర్తపై ఫిర్యాదు చేస్తాం



మాట్లాడుతున్న వక్కల ఉమ

గుంతకల్లు, జూలై 7(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ సమన్వయకర్త వాసగిరి మణికంఠ ఒకరిద్దరిని పక్కన పెట్టుకుని సీనియర్లను నిర్లక్ష్యం చేస్తున్నారని, ఈ విషయాన్ని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని ఆ పార్టీ నాయకురాళ్లు వక్కల ఉమ, విజయ జ్యోతి అన్నారు. స్థానిక ఇల్లూరి లక్ష్మీనారాయణ భవన్‌లో సోమవారం వారు మాట్లాడుతూ.. జనసేన ఆవిర్భావం నుంచీ పార్టీ కోసం పని చేసిన వారికి.. పార్టీ కార్యక్రమాలపై ఏమాత్రం సమాచారమివ్వకుండా చులకనచేస్తున్నారన్నారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్నా... పార్టీకి చెడ్డపేరు రాకూడదని ఇన్నాళ్లు ఓర్చుకున్నామని, ఇక వీర మహిళలు సహించేది లేదని అన్నారు. సమావేశంలో జనసేన నేతలు స్వర్ణ, శారద, తులసెమ్మ, సునీత, ఉలిగమ్మ, మేరి, నరసమ్మ పాల్గొన్నారు.

వైభవంగా విఠోబస్వామి బ్రహ్మోత్సవాలు

పామిడి, జూలై 7(ఆంధ్రజ్యోతి): స్థానిక విఠోబస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారిని హనుమాన్ వాహనంపై ఊరేగించారు. స్వామి వారికి అభిషేకాలు, హోమము, పూర్ణాహుతి, మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు.

● రాయదుర్గం: ఆషాఢ శుద్ధ ద్వాదశి సందర్భంగా స్థానిక పాండురంగస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తిని రథంలో కొలువుదీర్చి ఊరేగించారు.



పామిడి, రాయదుర్గంలో స్వామివార్ల ఊరేగింపు

గ్రామాల్లో సుపరిపాలనకు తొలి అడుగు

పామిడి, జూలై 7(ఆంధ్రజ్యోతి): స్థానిక 11వ వార్డులో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఏపీ లేబర్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ వెంకటశివుడుయాదవ్ సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్, నాయకులు బొల్లు శ్రీనివాసరెడ్డి, జింకల సంజీవకుమార్, బొమ్మా మోహన్‌కృష్ణ, చీమల రాము యాదవ్ పాల్గొన్నారు.

● రాయదుర్గంరూరల్ : మండలంలోని చదంగొల్లలదొడ్డిలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో సర్పంచ్ మల్లేశప్ప, నాయకులు కాలవ భరత్, అశోక్, కాటా వెంకటేశులు, సోమశేఖర్ పాల్గొన్నారు.

● తాడిపత్రి : స్థానిక తన నివాసంలో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి బూత్‌లెవల్ సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. అనంతరం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి.. ప్రభుత్వం చేసిన అభివృద్ధి.. పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్వీ రవీంద్రారెడ్డి, హరినాథ్‌రెడ్డి, షెక్షావలి, మల్లికార్జున, విజ్జి పాల్గొన్నారు.



పామిడిలో పథకాలు వివరిస్తున్న ఎంపీ, నాయకులు



సీజీదొడ్డిలో విప్ కాలవ ప్రచారం

వెంగన్నపల్లిలో ఆరేళ్ల తర్వాత మొహర్రం

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్ : యాడికి మండలంలోని వెంగన్నపల్లి గ్రామంలో ఆరేళ్ల తర్వాత మొహర్రం వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇది సమస్యాత్మక గ్రామం కావడంతో ఈ వేడుకల నిర్వహణకు పోలీసులు 2018 నుంచి అనుమతించలేదు. ఆరేళ్ల తర్వాత మొహర్రం వేడుకల నిర్వహణకు పోలీసుల అనుమతి ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే యాడికి, విడపనకల్లు, బెళుగుప్ప, బొమ్మనహాళ్, యల్లనూరు, తాడిపత్రి, గుత్తి, పుట్లూరు, గుమ్మఘట్ట, రాయదుర్గం, పెద్దవడుగూరు మండలాల్లో జలధి కార్యక్రమం నిర్వహించారు. పీర్లను అందంగా ముస్తాబు చేసి.. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు.



వెంగన్నపల్లిలో ఆరేళ్ల తర్వాత కొలువుదీరిన పీర్లు



ఉద్దేహాళ్‌లో పీర్ల ఊరేగింపు



నందలపాడులో జలధికి వెళ్తున్న పీర్లు

ఆటోకు నిప్పు

గుంతకల్లుటౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులగుట్టపల్లి పెద్ద తండా గ్రామానికి చెందిన తుకారం నాయక్‌కు చెందిన ఆటోను ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. తుకారం గుంతకల్లు పట్టణంలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాను. ఆదివారం రాత్రి ఆటోను ఇంటి ముందర ఉంచి నిద్రపోయాడు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తన ఆటోకు నిప్పు అంటించినట్లు గుర్తించిన తన తమ్ముడు సురేష్ నాయక్ కేకలు వేశాడని, దీంతో చుట్టుపక్కల వారి సాయంతో ఆ మంటలు ఆర్పివేశామని తుకారం తెలిపాడు. ఈప్రమాదంలో సుమారు రూ. 40 వేలు నష్టం జరిగిందని తెలిపాడు.

యువకుడి ఆత్మహత్య

కూడేరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మూరు గ్రామ సమీపంలోని స్కంద వెంచర్‌లోని ఓ ఇంట్లో నివాముంటున్న ఆదినారాయణ నాయక్ (23) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వజ్రకరూర్ మండలం వీసీ ప్యాపిలి తండాకు చెందిన ఇతని కుటుంబం స్కంద వెంచర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటోంది. ఇటీవల ఆదినారాయణ నాయక్‌ను ఓ కేసు విషయంలో రిమాండ్‌కు వెళ్లి వచ్చాడు. ఆదివారం అతని కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లడంతో.. ఇంట్లో ఒంటరిగా ఉన్న అతను ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు విషయాన్ని గుర్తించి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆదినారాయణ నాయక్ తండ్రి కలేనాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఆదినారాయణ నాయక్ ఉరవకొండలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఐటీఐ చేస్తున్నట్లు సమాచారం.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



తిప్పేస్వామి (ఫైల్)

బెళుగుప్ప, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుడి గ్రామానికి చెందిన తిప్పేస్వామి (52) అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. ఇతను ఆదివారం పుల్లంపల్లి గ్రామానికి వెళ్లి స్వగ్రామానికి బైక్‌పై తిరిగి వస్తుండగా.. లారీని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తిప్పేస్వామికి భార్య శ్యామలమ్మ, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

జూదరుల అరెస్ట్

తాడిపత్రి, జూలై7(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతబీఎస్ఎన్ఎల్ ఆఫీసు సమీపంలో ఆరుగురు పేకాటరాయుళ్లను సోమవారం అరెస్ట్‌చేసి వారివద్ద నుంచి రూ.6085 స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. వారిని రిమాండ్‌కు తరలించామన్నారు.

పప్పులబట్టీ వద్ద అగ్నిప్రమాదం



చెలరేగుతున్న మంటలు

తాడిపత్రి, జూలై 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యల్లనూరురోడ్డు సమీపంలో ఉన్న పప్పులబట్టీ వద్ద నిల్వ ఉన్న కట్టెలకు ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. పప్పులబట్టి యాజమాన్యం గుర్తించి ఫైర్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు మంటలను ఆర్పివేశారు. దీంతో ఆ మంటలు పప్పులబట్టికి వ్యాపించలేదు. అయితే రూ.2 లక్షల విలువైన కట్టెలు దగ్ధమైనట్లు తెలిపారు.

ఆయుధాలతో వాయిదాకు..

తాడిపత్రి, జూలై 7(ఆంధ్రజ్యోతి): పెద్దపప్పూరు మండలంలోని వరదాయపల్లి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు వాయిదా ఉండటంతో స్థానిక కోర్టుకు సోమవారం బయలుదేరారు. వారు బైక్‌లో కొడవలితో వస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు కోర్టు బయట ఉండి వారి బైక్‌ను ఆపి, వారిని విచారించారు. తోట నుంచి నేరుగా కోర్టుకు వచ్చామని వారు తెలిపారు. ఆ బైక్‌ను సీజ్ చేసినట్లు సమాచారం.

రిటైర్డ్ హెచ్ఎం కాశీనాథ్‌కు సన్మానం



రిటైర్డ్ హెచ్ఎం కాశీనాథ్‌ను సన్మానిస్తున్న ఆర్ జితేంద్రగౌడ్

గుంతకల్లు టౌన్, జూలై7(ఆంధ్రజ్యోతి): స్థానిక రవీంద్రనాథ్ ఠాగూర్ పురపాలక ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఆర్‌హెచ్ఎం కాశీనాథ్ జూన్ 30న ఉద్యోగ విరమణ పొందారు. దీంతో స్థానిక మహేంద్ర కల్యాణ మండపంలో ఆదివారం ఆయనకు సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీనాథ్ తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అభివృద్ధికి రూ.లక్ష, యూటీఎఫ్‌కు రూ. 5 వేలు, ఏపీటీఎఫ్‌కు రూ.5 వేలు విరాళం ప్రకటించారు. అనంతరం కాశీనాథ్, గిరిజమ్మ దంపతులను టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడ్, టీడీపీ ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాశీనాథ్ కుమారుడు ఆర్‌హెచ్ఎం విశ్వేతేజ, కుమార్తె ఆర్‌హెచ్ఎం ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ఆందోళన



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

కణేకల్లు, జూలై 7(ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండలంలోని జక్కలవడికి గ్రామంలోని ఎస్సీ కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ గ్రామంలోని గ్రామ సచివాలయం వద్ద, సర్పంచ్ ఇంటి వద్ద ఖాళీ బిందెలతో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. తమ కాలనీకి అనేక ఏళ్లుగా తాగునీటి సరఫరా లేకపోవడంతో గొల్లలదొడ్డికి వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నామని వాపోయారు. దీనిపై అనేకసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా.. సమస్య పరిష్కారం కాలేదన్నారు. సమస్యను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఈఓఆర్డీగా శివప్రసాద్

పుట్లూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండల ఈఓఆర్డీగా శివప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కడప జిల్లా అట్లూరు మండలం నుంచి ఇక్కడి వచ్చారు. ఇక్కడి ఈఓఆర్డీ జిలాన్‌బాషా ఉద్యోగోన్నతిపై శెట్టూరుమండలానికి ఎంపీడీఓగా వెళ్లారు.